

ఇక.. పంపకాలే..

'ఏ పార్టీ వాళ్లు ఎంత పంచుతున్నారు? ఎవరు ఎక్కువ ఇస్తున్నారు?' పల్లె, పట్టణాల్లో ఎక్కడ చూసినా ఇప్పుడు ఇదే చర్చ. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం ప్రచార హోరు ముగియడంతో పంపకాలు జోరందుకున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో తొలిసారిగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. హిందూపురం ఎంపీ స్థానంతోపాటు, 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. గతనెల 29న నామినేషన్ల పర్వం ముగిసిన అనంతరం 13 రోజులపాటు హోరాహోరీగా ప్రచారం సాగించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు.. బంధువులు, అనుచరగణంతో అవిశ్రాంతంగా ప్రచారం చేశారు. ఓటర్లను అకట్టుకునే దిశగా వినూత్న ప్రచారాలు చేపట్టారు. పొలాలవెంట కూడా తిరిగారు. ఎన్నడూలేనివిధంగా భారీ జనసమీకరణతో మైకులు, టపాసులతో ప్రచారం హోరెత్తించారు. మద్యంప్రియులు తాగుతూ.. ఊగుతూ.. ప్రచారంలో పాల్గొన్నారు.

- పుట్టపర్తి

- మూగబోయిన మైకులు
- మొదలైన ప్రలోభాలు
- ఊరూరా నోట్ల వరద
- మద్యం షాపుల వద్ద భారీ క్యూలు

కూటమి మేనిఫెస్టోతో జోష్



ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల్లో జోష్ కనిపించింది. టీడీపీ కూటమి హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు ఆ పార్టీ ప్రచారంలో ఊపు తెప్పించాయి. మహిళలను ఆకట్టుకున్నాయి. దీంతో కూటమి అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోయారు, వారికి యువత అండగా నిలిచారు. వైసీపీ అధినేత జగన్ ప్రకటించిన మేనిఫెస్టో ప్రజలను ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. ఆ పార్టీ వర్గాలే తీవ్ర నిరుత్సాహం వ్యక్తం చేశాయి. అభ్యర్థులకు నిరాశ మిగిల్చింది. దీంతో వైసీపీ ప్రచారంలో నిస్తేజం కనిపించింది. ల్యాండ్ టైటిలింగ్ చట్టం కూటమి అభ్యర్థులకు బ్రహ్మాస్త్రమైంది. ఈ చట్టం అమలుతో రైతులు.. భూములపై హక్కులు కోల్పోతారన్న విషయం బలంగా జనంలోకి తీసుకెళ్లారు.



మైకులు బంద్

అధికారికంగా, అనధికారికంగా 55 రోజులపాటు ప్రధాన పార్టీలు ప్రచారం నిర్వహించాయి. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు మార్చి 16న నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రంలో ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ చేశారు. మార్చి 17 నుంచి జిల్లాలో ఎన్నికల వేడి మొదలైంది. టిక్కెట్లు తమవేనని భావించిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ముందస్తు ప్రచారం నిర్వహించారు. అలా కొంత మంది అభ్యర్థులకు సమయం కలిసిరావడంతో ఆయా నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. బంధుగణంతో కలిసి బృందాలుగా ఏర్పడి, మండలాలు, గ్రామాలవారీగా ప్రచారం చేశారు. ఆఖరిరోజు శనివారం రోడ్‌షోలతో హోరెత్తించారు.

ప్రలోభాల జోరు

ఎన్నికల ప్రచారానికి తెరపడటంతో ఓటర్లను ఎలాగైనా తమవైపు తిప్పుకోవడానికి ప్రలోభాలకు తెరలేపారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉండి ఆర్థికంగా బలపడటంతో వైసీపీ అభ్యర్థులు డబ్బు సంచులతో ఓటర్లకు ఎర వేస్తున్నారు. రాత్రికి రాత్రి డబ్బు సంచులు గ్రామాలకు చేరిపోయాయి. తమ అనుచరుల ద్వారా ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేలదాకా పంపిణీ చేపట్టారు. మరి కొంతమంది ఓటరు స్లిప్పుల్లో నోట్లను కట్టి అందిస్తున్నట్లు తెలుస్తోంది. మద్యం బాటిళ్లను సైతం డోర్ డెలివరీ చేస్తున్నారు. అక్కడక్కడ అధికార పార్టీ నాయకుల ప్రలోభాలను టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నా.. లెక్కచేయట్లేదు. 'చేతనైతే మీరూ పంచుకోండనీ, మాకు అడ్డువస్తే తాటతీస్తామం'టూ బెదిరింపులకు దిగుతున్నారు.

మద్యం కోసం క్యూ

మద్యం ప్రియులకు ఎన్నికలు పండుగను తెచ్చిపెట్టాయి. పార్టీల ప్రచారంలో మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల వేళ విచ్చలవిడిగా పంచేందుకు అధికార పార్టీ ఇప్పటికే పెద్దఎత్తున మద్యం నిల్వ చేసింది. పెద్దపెద్ద డంపులనే ఏర్పాటు చేసుకున్నట్లు చర్చ సాగుతోంది. ఆది, సోమవారాల్లో మద్యం వరద పారుతుందన్న చర్చ సాగుతోంది. జిల్లాలో బార్లు, మద్యంషాపుల వద్ద ఎగబడుతున్నారు. శనివారం భారీ క్యూలు కనిపించాయి. ఆది, సోమవారాల్లో మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధిస్తుండటంతో బాక్సులు లెక్కన కొనుగోలు చేశారు. కర్ణాటక సరిహద్దు నుంచి ట్రక్కుల కొద్దీ మద్యం జిల్లాలోకి వచ్చింది. నిఘా కళ్లుగప్పి అడ్డదారుల్లో కావాల్సినంత మద్యం ఇప్పటికే గ్రామాలకు చేరిపోయింది. తాగండి.. తూలండి అన్నట్లు మద్యం సరఫరా చేస్తున్నారు.

ఓటరు కార్డు లేకపోయినా

ఓటు వేయొచ్చు

ఇతర గుర్తింపు కార్డులతో ఓటు పొందవచ్చు
జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

పోలింగ్ సందర్భంగా 144 సెక్షన్
ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి/పుట్టపర్తి రూరల్, మే 11: ఓటరు గుర్తింపుకార్డు లేకపోయినా ఇతర గుర్తింపు కార్డులతో ఓటు వేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్పీ మాధవరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో పేరుండి గుర్తింపు కార్డు లేకపోయినా, ఆధార్, బ్యాంకుపుస్తకం, పాన్ కార్డు, 12 రకాల గుర్తింపుకార్డుల్లో ఏది ఉన్నా ఓటు వేయవచ్చన్నారు. శనివారం సాయంత్రంతో జెండాలు, మైకులతో కూడిన ప్రచారానికి గడవు ముగిసిందన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకుంటారన్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర సరిహద్దులో 14 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతర నిఘా ఉంచామన్నారు. 11,729 మందిని బైండోవర్ చేశామన్నారు. ఇంతవరకు రూ.2.35 కోట్లు సీజ్‌చేసి, 945 కేసులు నమోదు చేశామన్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో రాష్ట్ర పోలీసులతోపాటు, కేంద్ర బలగాలతో నిఘా ఉంచామన్నారు. సమావేశంలో డీఆర్వో కొండయ్య పాల్గొన్నారు.

పుట్టపర్తికి డీఐజీ



డీఐజీ షీముషికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, మే 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల అనంతపురం రేంజ్ డీఐజీగా నియమితురాలైన షీముషి శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. జిల్లాలో భద్రతాచర్యలపై చర్చించారు. ఎస్పీతోపాటు ఏఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్పీసీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి సైబర్ సెల్ సీఐ హేమంత్‌కుమార్, సీపీ రాఘవేంద్ర ఏఆర్ ఎస్ఐలు రవికుమార్, వలి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

జాతిని నిర్వీర్యం చేస్తారా?

ప్రశ్నించిన జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్



సబ్‌జైలును తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయాధికారి

కదిరిలీగల్, మే 11: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి, విద్రోహులుగా మారి జాతిని నిర్వీర్యం చేస్తారా అని జిల్లా న్యాయాధికారి జి శ్రీనివాస్.. ఖైదీలను ప్రశ్నించారు. పట్టణంలోని సబ్‌జైలును న్యాయాధికారి జయలక్ష్మి, మీనాక్షి సుందరితో కలిసి జిల్లా న్యాయాధికారి శనివారం తనిఖీ చేశారు. జైలులో ఉంటున్నవారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చోరీలు, దోపిడీలకు పాల్పడి యువత పక్కదారి పడితే జాతి ఎలా అభివృద్ధి చెందుతుందో ఆలోచించాలన్నారు. జిల్లాలోని ప్రతి సబ్‌జైలును తనిఖీ చేస్తున్నామన్నారు. సబ్‌జైలు ఆవరణలో ఇంకుడుగుంతల నిర్మాణానికి నివేదికలు పంపాలని జైలు అధికారి వాసుదేవన్‌కు సూచించారు. జిల్లా కేంద్రంలో ఏడీజే కోర్టు కోసం దీర్ఘకాలికంగా ఎదురు చూస్తున్న విషయం తనకు తెలుసనీ, త్వరలో నెరవేరబోతుందన్నారు.



ఖాద్రీశుడిని దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని జిల్లా న్యాయాధికారి జీ శ్రీనివాస్ శనివారం దర్శించుకున్నారు. న్యాయాధికారికి తూర్పు రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందించారు. కార్యక్రమంలో స్థానిక న్యాయాధికారి ఎస్. ప్రతిమ పాల్గొన్నారు.



ధర్మవరంలో దౌర్జన్యాలు..!

ప్రత్యర్థులపై దాడులకు తెగబడుతున్న వైసీపీ
ప్రజలను భయపెట్టడమే లక్ష్యం
ఓటింగ్ శాతం తగ్గించేందుకు కుతంత్రాలు
వారం రోజులుగా వరుస దాడులు

ధర్మవరం, మే 11: నియోజకవర్గంలో వైసీపీ అరాచక పర్వానికి తెరలేపింది. దౌర్జన్యాలు సాగిస్తోంది. నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా ఏకమవడం, కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాలని నిర్ణయించుకోవడాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మొదట్లో స్థానికేతరుడు సత్యకుమార్ అభ్యర్థిగా వచ్చాడంటూ వైసీపీ నాయకత్వం ఈ ఎన్నికలను సాదాసీదాగా తీసుకుంది. గెలుపు తమదే అనుకుంది. సత్యకుమార్‌కు కేంద్రం పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉండటం, ఆయనను గెలిపిస్తే భారీఎత్తున నిధులు తీసుకొచ్చి, ధర్మవరం రూపురేఖలు మార్చుతారన్న నమ్మకం ప్రజల్లో బలపడింది. దీంతో ధర్మవరం ప్రజలు.. కూటమి అభ్యర్థి వైపు మొగ్గు చూపుతున్నారు. దీనిని వైసీపీలో అభద్రతాభావం పెంచిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అధికార పార్టీ నాయకులను ఓటమి భయం పట్టుకుంది. నియోజకవర్గంలో మళ్లీ పట్టు సాధించేందుకు దౌర్జన్యాన్నే మార్గంగా ఎంచుకున్నారు. అందులో భాగంగా పది రోజుల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి బలమైన నాయకత్వం ఉన్న ప్రాంతాల్లో దాడులకు తెగబడుతూ భయభ్రాంతులకు లోనుచేస్తున్నారు.

మరి కొన్ని ప్రాంతాల్లో ఎన్డీఏకి ఓటువేస్తే సహించే ప్రసక్తే ఉండదని తీవ్ర హెచ్చరికలు సైతం జారీ చేస్తున్నారు. బత్తలపల్లి మండలం తంబాపురంలో అధికార పార్టీకి చెందిన ఓ సర్పంచ్ ఎస్సీలపై దాష్టీకం ప్రదర్శించాడు. 'మీరు వైసీపీకి ఓటు వేసే పరిస్థితిలో లేరనీ, పోలింగ్ రోజు గ్రామంలో ఉండరాదంటూ' హుకుం జారీ చేశాడు. దీంతో ఎస్సీలు తీవ్ర ఆందోళనకు లోనైన విషయం తెలిసిందే. ధర్మవరం మండలం రావులచెరువులో వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి.. ఎరుకల సామాజికవర్గానికి చెందిన పలువురిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. వైసీపీకి ఓటు వేయకపోతే మీ అంతు తేలుస్తానని బెదిరించాడు. 'నా ఇంటికి రాకపోతే నేనే మీ దగ్గరకు వచ్చి మీ అంతు తేల్చుతాన'ని ఏకంగా ధర్మపురి గ్రామానికే వెళ్లి వారిని బెదిరించడానికి ప్రయత్నించగా వారంతా తిరగబడటంతో అక్కడి నుంచి ఉడాయించాడు. పట్టణంలోని పోతుకుంట బ్రిడ్జి సమీపంలో టీడీపీ నాయకులు ముద్దుక్రిష్ణ, బాలమల్లికార్జునపై దాడిచేశారు. ధర్మవరంలోని కదిరి గేటు వద్ద అభ్యర్థి సత్యకుమార్ అనుచరులు భాను, శ్రీనివాసులుపై విచక్షణా రహితంగా దాడి చేశారు. తాజాగా శుక్రవారం రాత్రి కొత్తపేటకు చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ మాధన మహేశ్వరి ఇంట్లోకి చొరబడి ఆమెతోపాటు భర్త సుబ్బయ్య, కుమారులు దివాకర్, గణేశ్‌పై మారణాయుధాలతో వైసీపీ నాయకులు దాడిచేశారు. టీడీపీ 27వ వార్డు అధ్యక్షుడిని జడ్పీ వైస్‌చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి, అతడి అనుచరులు బెదిరించి, అతని వద్దనున్న సెల్‌ఫోన్ కూడా లాక్కున్నారు. పట్టణంలోని 6, 7 వార్డుల్లో కూటమిలో చురుగ్గా ఉన్న పలువురిని బెదిరించి, ఎన్నికలకు దూరంగా ఉండాలని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. తాడిమర్రి మండలంలోని పిన్నదరి గ్రామంలో సోమశేఖర్‌పై వైసీపీ నాయకులు తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు. ఇలా దాడులు చేస్తూ ఓటింగ్ శాతాన్ని తగ్గించడంతోపాటు ఎన్డీఏలోని ద్వితీయ శ్రేణి నాయకులు పోలింగ్ కేంద్రాల వద్దకు రాకుండా భయాందోళనలకు లోనుచేయాలని కుతంత్రం పన్నారు. వైసీపీ నాయకులు ఓటమిభయంతోనే దాడులు చేస్తున్నారనీ, వాటికి భయపడాల్సిన అవసరం లేదని కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ ధైర్యం చెబుతున్నారు. అండగా ఉంటానని భరోసా నింపుతున్నారు.

11 మంది వైసీపీ కార్యకర్తలపై కేసు

ధర్మవరం, మే 11: పట్టణంలోని కొత్తపేట ప్రాంతానికి చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ మాధన ఉమామహేశ్వరి కుటుంబసభ్యులపైమారణాయుధాలతో దాడికి సంబంధించి టూటౌన్ పోలీసులు వైసీపీ నాయకులు బడన్నపల్లి కేశవరెడ్డి, మరో 10 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మాజీ కౌన్సిలర్ మాధన మహేశ్వరి, ఆమె భర్త సుబ్బయ్య, కుమారులు దివాకర్, గణేశ్‌పై శుక్రవారం రాత్రి కేశవరెడ్డి, అతడి అనుచరులు తీవ్రంగా దాడిచేసిన సంగతి తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నంపెట్టిన ఇంటినే కొట్టేసిన

మంత్రిగారి భర్త..!

మంత్రి, వైసీపీ పెనుకొండ అభ్యర్థి ఉష భర్త చరణ్‌రెడ్డి కబ్జా బాగోతమిది. తండ్రిలేని చరణ్‌రెడ్డిని చేరదీసి, పెంచి పోషించిన మేనమామకే మోసం చేశాడు. అన్నం పెట్టిన ఇంటినే కబ్జా చేశాడు. తన ఇంటికి దారి కోసం స్థలం వదలాలని చెప్పి, ఏకంగా ఇంటినే రాయించుకుని, అన్నం పెట్టిన మేనమామను రోడ్డున పడేశాడు. చిన్నప్పట్నుంచి పెంచి, పోషించిన మేనల్లుడు మోసం చేయడంతో భరించలేక ఆ మేనమామ తీవ్ర ఆవేదనకు లోనై, మంచంపట్టాడు. ఆస్పత్రిలో జీవచ్ఛవంలా పడి ఉన్నాడు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

బెంగళూరులో రూ.కోట్ల విలువచేసే ఇళ్లు కబ్జా
దారి కావాలని ఇళ్లనే రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనం
కరెంటు బిల్లు రావడంతో నిర్ఘాంతపోయిన బాధితులు

బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచంపట్టిన చరణ్‌రెడ్డి మేనమామ జగన్నాథం

మేనమామకు చరణ్‌రెడ్డి మోసం



మంత్రి కబ్జా చేసిన ఇల్లు



చరణ్‌రెడ్డి



ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య జగన్నాథం

చిన్నప్పట్నుంచి పెంచినా..

కళ్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీ కుటుంబం అక్రమాలతో సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే విసిగిపోయారు. మంత్రి తమకొద్దు అంటూ తేల్చిచెప్పారు. నిరసనలకు దిగారు. దీంతో మంత్రి పెనుకొండకు మకాం మార్చిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ వారికే కాదు.. ఆలనాపాలన చూసిన ఇంటికి మంత్రి భర్త చరణ్‌రెడ్డి కన్నం పెట్టిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొరుగు రాష్ట్రంలోని బెంగళూరులో మంత్రి భర్త కబ్జా వ్యవహారం బయటపడింది. చరణ్‌రెడ్డి మేనమామ జగన్నాథం కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చరణ్‌రెడ్డి చిన్నతనంలోనే తండ్రి నరసింహారెడ్డి మృతిచెందాడు. చరణ్‌రెడ్డి, అతడి తల్లి జయమ్మ దిక్కులేనివారయ్యారు. వారి ఆలనాపాలన చరణ్‌రెడ్డి మేనమామ జగన్నాథం చూశారు. పెంచి, పోషించారు. ఆయన బెంగళూరులో నివాసముంటున్నారు. జగన్నాథం, చరణ్‌రెడ్డి కుటుంబాలు కలిసే ఉండేవి. ఉషశ్రీని చరణ్‌రెడ్డి వివాహం చేసుకున్న తర్వాత కూడా అలానే ఉండేవారు. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ జగన్నాథం ఐదేళ్ల క్రితం రిటైరయ్యారు. తద్వారా వచ్చిన సొమ్ముతో నాలుగేళ్ల క్రితం బెంగళూరులోని యలహంక పరిధి సింగనాయకనహళ్లిలో తన పాతబడిన ఇంటి వెనకాలే కొత్త ఇల్లు కట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఉషశ్రీ కళ్యాణదుర్గం నుంచి వైసీపీ తరఫున పోటీ చేసి 2019లో ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం మంత్రిగా కొనసాగుతున్నారు. బెంగళూరులోని జగన్నాథం ఇంటి పక్కనే చరణ్‌రెడ్డి రెండేళ్ల క్రితం స్థలం కొన్నాడు. ఆ స్థలానికి వెళ్లేందుకు మామ జగన్నాథం ఇంటిపక్కనే 30 అడుగులు దారికి వదలాలని మామ జగన్నాథాన్ని బతిమలాడాడు. అల్లుడే కదా.. అని జగన్నాథం తన ఇంటి పక్కనే 30 అడుగులు రోడ్డుకి వదిలేస్తూ ఆ మేరకు యలహంక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడు. జగన్నాథం నివాసముంటున్న ఇంటికి కరెంటు బిల్లు చరణ్‌రెడ్డి పేరుతో రావడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఇదేమిటని చరణ్‌రెడ్డిని అడగ్గా.. సరైన సమాధానం చెప్పలేదు. చరణ్‌రెడ్డి భార్య ఉషశ్రీ మంత్రి కావడంతో వారు గట్టిగా అడగలేక కోర్టును ఆశ్రయించారు. తాను పెంచిన మేనల్లుడే తన ఇళ్లను కాజేయడాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్తాపం చెందిన జగన్నాథం బ్రెయిన్ స్ట్రోక్ బారినపడ్డారు. ఆస్పత్రిలో మంచానికే పరిమితమయ్యారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. మంత్రి భర్త దారి పేరుతో ఇళ్లనే రాయించుకోవడంపై జగన్నాథం భార్య నాగవేణి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నప్పట్నుంచీ పెంచి పోషించినందుకు ఇంత మోసం చేస్తారా అంటూ వాపోతున్నారు. తమను చిత్రహింసలు పెట్టారంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు.



నీళ్లు రాకపాయ... చెరువు ఎండిపాయ



ఇక్కడ కనిపిస్తున్నది అనంతపురం రూరల్ మండలం పాముురాయి చెరువు. పూర్తిగా ఎండిపోయింది. ఈ దుస్థితికి నేటి పాలకులే కారణమని గ్రామస్థులు మండిపడుతున్నారు. 2009 నుంచి 2019 వరకు పరిటాల సునీత ఎమ్మెల్యే, మంత్రిగా పదేళ్ల పాటు పనిచేశారు. ఈ కాలం చెరువు ఎండకుండా ఏదో విధంగా హెచ్చెల్సీ నీటిని తెప్పించేవారని వారు చెబుతున్నారు. చెరువులో నీరు ఉండటంతో చేపల పెంపకం బాగా పెరిగి సొసైటీకి ఆదాయం చేకూరేది. భూగర్భ జలాలు పెరిగి పంటలకు నీటి ఎద్దడి లేకుండా ఉండేదని రైతులు అంటున్నారు. గత రెండేళ్లుగా చెరువుకు చుక్క నీరొచ్చింది లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరులేక చెరువు వెల..వెలబోతోందని వారు పేర్కొంటున్నారు.

- అనంతపురంరూరల్

ఓటరు కార్డు లేకుంటే.. వీటిలో ఏదో ఒకటి..



ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో ఓటరు పేరు తప్పని సరిగా ఉండాలి. అలాగే ఓటరు గుర్తింపు కార్డు ఉండాలి. ప్రస్తుతం ఓటరు స్లిప్‌లను కూడా పంపిణీ చేస్తున్నారు. అయితే ఓటరు కార్డు అందుబాటులో లేకున్నా ఎన్నికల్లో ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. పోలింగ్ రోజున సమయానికి ఓటరు కార్డు దొరక్కపోతే లేదా పోగొట్టుకుంటే ఆ సమయంలో ఓటు హక్కు అవకాశాన్ని చేజార్చుకోవద్దని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఓటరు నమోదు చేసుకున్న వ్యక్తులు సమయానికి ఓటు కార్డు లేకపోయినా 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఉన్నా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

- అనంతపురం అర్బన్/ రూరల్

- ఆధార్ కార్డు
- పాన్‌కార్డు
- డ్రైవింగ్‌లైసెన్స్
- సేవా గుర్తింపు కార్డు
- ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డు
- ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డు
- పాస్‌పోర్ట్
- పెన్షన్ డాక్యుమెంట్స్
- ఉపాధి హామీ జాబ్‌కార్డు
- ఎన్‌పీఆర్ కింద ఆర్జీఐ
- జారీ చేసిన స్మార్ట్ కార్డు
- బ్యాంకు, పోస్టాఫీసు పాస్‌బుక్
- ఎంపీలు, ఎమ్మెల్యేల ఎన్నికలకు అధికారులు జారీ చేసిన ప్రత్యేక గుర్తింపు కార్డులు

సోమవారం మీ కత చెప్తాం..



అనంతపురం సెంట్రల్, మే 11: సార్వత్రిక ఎన్నికలవేళ వీధివీధిన డబ్బుల గొడవలు నెలకొంటున్నాయి. వైసీపీ నాయకులు ఓట్లు కొనుగోలుకు డబ్బులు పంచడంతో డబ్బలందని వారు దూషణలకు దిగుతున్నారు. ప్రాంతాల వారిగా ఓటర్ల సంఖ్య లెక్కగట్టి ఒక్కో ఓటుకు రూ.2వేల చొప్పున పంచుతున్నారు. ఈ క్రమంలో వీధిలోని కొంతమందికి ఇచ్చి మరికొంతమందికి ఇవ్వక పోవడంతో ప్రజలు ఆగ్రహిస్తున్నారు. మాకెందుకు ఇవ్వలేదని వైసీపీ నాయకులను నిలదీస్తున్నారు. వాళ్లే ఓటర్లా? మేము కనడబడలేదా అని ప్రశ్నిస్తుండటంతో డబ్బులివ్వడానికి వచ్చినవారు అక్కడి నుంచి జారుకుంటున్నారు. మీ నాయకుడు ఎలా గెలుస్తారో మేముకూడా సోమవారం చెబుతామని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

భలే వ్యాపారం



ఎన్నికల పోటీలో నిలబడిన అభ్యర్థులు కొంతమంది నాయకులను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. మా ప్రాంతంలో ఇంతమంది ఓటర్లున్నారు. ఇంతమొత్తం అవుతుందని సొమ్ము తీసుకు వచ్చిన నాయకులు కొంతమంది ఓటర్లకే పంచి, మిగిలి సొమ్మును జేబులోకి వేసుకుంటున్నారు. పైకి మాత్రం అందరికీ పంచినట్లు అభ్యర్థులకు లెక్కలు చూపుతున్నారు. ఎన్నికల్లో నాయకులుగా చెప్పుకుని పంపిణీ పేరుతో భలే వ్యాపారం చేసుకుంటున్నారు.

లక్ష ఎకరాలకు నీరెక్కడ తోపూ..!

- పేరూరు డ్యాంను నీరుగార్చారు..
- పరిహారం కోసం రైతుల ఎదురుచూపు
- నీరు ఇచ్చానని ఊదరగొడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి





ఆత్మకూరు, మే 11 : పేరూరు డ్యాంకు నీళ్లు ఇచ్చి రాప్తాడు నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తానని ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరూరు డ్యాంను నీరుకార్చడమే కాకుండా మూడు డ్యాంల పేరుతో పంగనామాలు పెట్టారని మండిపడుతున్నారు. ఐదేళ్లపాలనలో సొంత గ్రామం తోపుదుర్తి డ్యాం కలగానే మిగిలిపోయింది. తట్టెడు మట్టికూడా తీయలేదు.. భూములు ఇచ్చిన రైతులు పరిహారం కోసం ఎదురుచూసి అలసిపోయారు. పేరూరు కాలువ పనులు వైసీపీ అధికారంలోకి రాగానే నిలిచిపోయాయి. రాప్తాడు నియోజకవర్గంతో పాటు పరిసర మండలాల రైతులకు మేలు చేకూర్చేలా టీడీపీ అధికారంలో ఉన్నపుడు మంత్రిగా పని చేసిన పరిటాల సునీత ప్రత్యేక చొరవ తీసుకున్నారు. 2018లో ప్రభుత్వం రూ.804 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. జీడిపల్లి జలాశయం నుంచి 51 కిలో మీటర్లు కాలువ నిర్మాణం, నాలుగుచోట్ల లిఫ్టులు, నాలుగుచోట్ల జలాశయాలకు అనుమతులతో నిర్మాణానికి చర్యలు చేపట్టి సగానికి పైగా పనులు పూర్తి చేశారు. 2019లో టీడీపీ అధికారం కోల్పోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కాలువ పరిధిలో కొన్ని జలాశయాలు రద్దు చేసి ప్రస్తుత ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మరోసారి 2023 డిసెంబరులో చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి వద్ద వర్చువల్ విధానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కాలువ పనులు, రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి వదిలేశారు.

అసంపూర్తిగా లిఫ్టులు

జీడిపల్లి నుంచి పేరూరు డ్యాం వరకు నాలుగు లిఫ్టుల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఆత్మకూరు సింగనగుట్ట దగ్గర లిఫ్టు పనులు నిలిచిపోయాయి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పనులు ప్రారంభించారు. కోనాపురం, బాలవెంకటాపురం వద్ద లిఫ్టు పనులు చేయాల్సి ఉంది. వైసీపీ అధికారంలోకి రాగానే పేరూరుడ్యాం కాలువ పనులు మరుగున పడ్డాయి. ప్రారంభంలో కొంత మంది కాంట్రాక్టర్లు పనులు చేశారు. వారికి బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు నిలిపేసి వెళ్లిపోయారు. దీంతో కాలువ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందగా మారాయి.


వృధాగా ఉన్న లిఫ్టు గేట్లు

రైతులకు అందని పరిహారం

రైతులు తమ భూముల్లో కాలువ పనులు జరిగితే పంటలకు అనుకూలంగా ఉంటుందని కోటి ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే రైతులు ఆశలపై నీళ్ల చల్లారు. కాలువ పనులకు స్వచ్ఛందంగా భూములు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఐదేళ్లు గడిచినా పనులు చేయలేదు. రైతులకు డబ్బులు ఇవ్వలేదు. సాగునీటి కోసం లక్షలు విలువ చేసే భూములును కాలువ కోసం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వదిలేయడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. భూమి సాగుకు పనికి రాకుండా కాలువ తవ్వి వదిలేశారు.

పరిహారం డబ్బులు రాలేదు



మా పొలంలో కాలువ పనులుపూర్తి చేశారు. ఇప్పటికీ డబ్బులు రాలేదు. ఆరు ఎకరాలు పొలం కాలువకు ఇచ్చాం. నీళ్లువస్తాయని ఆశపడినా ఫలితం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పట్టించుకొనేవారు లేరు. కాలువ పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి. నాతో పాటు చాలామంది రైతులు చాలామంది స్వచ్ఛందగా కాలువ కోసం భూములు ఇచ్చాం.

- అక్కులన్న, ఆత్మకూరు

కలగానే ముట్టాల డ్యాం




ముట్టాల గ్రామంలో డ్యాం నిర్మాణం కలగానే మిగిలిపోయింది. డ్యాం వస్తుందని ఆశపడ్డాం, కాగితాలకే పరిమితం చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే రైతులను డ్యాం పేరుతో ఊరించారు. తర్వాత వదిలేశారు. భూగర్భజలాలు తగ్గిపోయి పంటలు పండించుకొనే రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రజలను మోసగించే పనులు చేస్తే సహించరు. రైతులను మోసం చేయడం మంచిదికాదు.

- చిన్న అక్కులప్ప, ముట్టాల

ప్రతి పనికీ కప్పం కట్టాల్సిందే..!

- కళ్యాణదుర్గంలో దోచేసి.. పెనుకొండకు..
- గెలిస్తే సొంత పార్టీ నాయకులపైనే కేసులు
- మంత్రి ఉష శ్రీచరణ్‌పై మండిపడుతున్న వైసీపీ నేతలు



హిందూపురం, మే 11 : గతంలో ఏ ప్రభుత్వంలో జరగని అవినీతి అక్రమాలు, భూదందాలు, కబ్జాలు, ఈ ఐదేళ్లలో జరిగాయి. వైసీపీ నాయకుల ఆగడాలకు జనం విలవిలలాడారు. ఈ పరిస్థితుల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలను బదిలీ చేశారు. ఎన్నో చోట్ల ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలిచినా, ఓడినా వారి స్థానాల్లోనే పోటీచేసేవారు. ఈసారి జగన్‌రెడ్డి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. 2019 నుంచి 2023 వరకు నియోజకవర్గాల్లో సామంత రాజులుగా ఏలిన వైసీపీ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో కొంత మందిని వదులుకోలేక మరో నియోజకవర్గానికి బదిలీ చేశారు. అలాంటి బదిలీనే పెనుకొండలో ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఉషశ్రీ పరిస్థితి. ఈమె కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యేగా గెలుపొంది, మంత్రిగా కూడా కొనసాగుతున్నారు. ఆ నియోజకవర్గంలో ప్రతి పనికి కప్పం కట్టాల్సిందే. ఆఖరికి సొంత పార్టీ నాయకులను కూడా వదల్లేదు. ఎవరైనా ఎదురు చెబితే వారిపై కేసులు పెట్టించారు. ఈ పరిస్థితుల్లో ఆ నియోజకవర్గంలో సొంత పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో అసమ్మతిరాగం వినిపించడంతో అధిష్టానం ఈమెను పెనుకొండకు పంపింది. ఇక్కడ మంత్రిగా పనిచేసిన శంకరనారాయణను అనంతపురం పార్లమెంట్‌కు బదిలీ చేసింది. అక్కడి చెత్త తీసుకొచ్చి ఇక్కడ వేసినంత మాత్రాన బంగారం ఎలా అవుతుందని సొంత పార్టీ నాయకులతోపాటు ప్రతిపక్ష పార్టీలు, సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

కళ్యాణదుర్గాన్ని దోచేసి..

ఉషశ్రీచరణ్ 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పలు రకాలుగా దోచేశారు. ఇసుక, మట్టి, భూదందాలు, ఏ చిన్న పనిచేయాలన్నా ఆమెకు కొంత మొత్తం సమర్పించుకోవాల్సిందేనని సొంత పార్టీ నాయకులే అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. లేఅవుట్ వేయాలన్నా, భూమి కొనాలన్నా, ఇళ్లు నిర్మించుకోవాలన్నా ఆమెకు కప్పం కట్టాల్సిందే. లేదంటే అధికారులను ఉసి గొలిపి ఏదో కొర్రిపెట్టి పనులు అడ్డగించడం సర్వసాధారణమైంది. ఈ పరిస్థితుల్లో అధిష్టానం గుర్తించి పెనుకొండకు బదిలీ చేశారు. ఇక్కడికి వచ్చిన కొద్దిరోజులకే ఇలాంటి వాటికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గానికి వచ్చి రాగానే తాడిపత్రికి చెందిన ఓ రియల్టర్ లేఅవుట్ వేస్తుంటే అందులో తక్కువ ధరకు ప్లాటు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. వారు ససేమిర అనడంతో రాత్రికి రాత్రే తన అనుచరులు లేఅవుట్‌లో నాటిన రాళ్లను పెకలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది అధికారుల ద్వారా భూములకు సంబంధించి కొల్లగొట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఇంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో దానికి పులిస్టాప్ పడినట్లు పెనుకొండలో చర్చనీయాంశంగా మారింది. దీంతోపాటు పెనుకొండ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులపై కక్రపెత్తనం సాగిస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ ముందే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా సొంత సామాజిక వర్గానికి చెందిన, ఇక్కడ పనిచేసిన ఎమ్మెల్యే శంకరనారాయణ పేరు బోర్డుపై ఉంటే తట్టుకోలేని మనస్తత్వం మంత్రిదంటూ ఆ కులస్థులే విమర్శిస్తున్నారు. అనతి కాలంలోనే పెనుకొండ నియోజకవర్గంలో సామంతరాజులాగా వ్యవహరించడం ప్రారంభించారు. ఇక్కడ కూడా అధికార పార్టీకి చెందిన బలమైన సామాజికవర్గాన్ని అణగదొక్కేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో ఇదే విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి కూడా ఓ ముఖ్య నాయకుడు తీసుకెళ్లాడు.

ప్రతిపనికీ కప్పం కట్టాల్సిందే..

పెనుకొండలో ఆమె గెలవకూడదని కళ్యాణదుర్గంకు చెందిన వైసీపీ నాయకులే ఇక్కడికి వచ్చి వారి బంధువులు, స్నేహితుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఆమె ఒక వేళ గెలిస్తే పెనుకొండ నియోజకవర్గాన్ని దోచేస్తుందంటూ చెబుతున్నారు. అటెండర్ ఉద్యోగి బదిలీ కావాలన్నా, ఆమెకు ముడుపులు సమర్పించుకోవాలని, ప్రతిపనికి కప్పం కట్టాల్సిన పరిస్థితి వస్తుందంటూ హెచ్చరిస్తున్నారు. గత 15రోజులుగా కళ్యాణదుర్గానికి చెందిన పదుల సంఖ్యలో నాయకులు ఇక్కడికి వచ్చి ఆమె పనితీరు, అక్కడ బీసీ వర్గీయులతో పాటు సొంత పార్టీ నాయకులకు పెట్టిన ఇబ్బందులను చెబుతున్నారు. ఒకవేళ పెనుకొండలో తిష్టవేస్తే ఇల్లు కట్టాలన్నా, భూమి కొనాలన్నా, లేఅవుట్ వేయాలన్నా, ఆఖరికి రైతు బోరువేసుకోవాలన్నా ఆమెకు తెలియకుండా చేయడానికి వీలుండదంటూ చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనా కళ్యాణదుర్గం దందాలను పెనుకొండకు బదిలీ చేశారంటూ జనం చర్చించుకుంటున్నారు.

ఖాకీలపై ఉత్తుత్తి ప్రేమ

- జగన్ పాలనలో పోలీసులకు సకాలంలో అందని రాయితీలు
- పేపర్‌కే పరిమితమైన వారాంతపు సెలవులు

హిందూపురం, మే 11

నిత్యం పనిఒత్తిడితో సతమతమయ్యే పోలీసుల పట్ల సీఎం జగన్‌ది ఉత్తుత్తి ప్రేమేననే విమర్శలు వినిపిస్తున్నాయి. తాము అధికారంలోకి రాగానే పోలీసులకు అది చేస్తాం. ఇది చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసమిచ్చిన వైసీపీ నాయకులు ఏమీ చేయకుండానే ఐదేళ్లు గడిపేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన రాయితీలను సైతం సకాలంలో అందించకుండా మోసం చేశారని మండిపడుతున్నారు. పోలీసులకు అందాల్సిన జీపీఎఫ్, సెరెండర్ సెలవులు, అరియర్స్ సకాలంలో అందక ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం పోలింగ్ సమీపిస్తున్న వేళ పోలీసులను తమవైపు తిప్పుకునేలా గట్టి ప్రయత్నం చేశారు. ఇప్పటివరకు ఇవ్వని సెరెండర్ సెలవుల సొమ్మును గతవారం బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. దీనిద్వారా పోలీసుల్లో తమపై ఉన్న వ్యతిరేకతను తగ్గించుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోలీసులకు ఉల్లాసం, ఉత్సాహం కరువైంది. గతంలో యోగ, మానసిక ప్రశాంతతకు శిక్షణా తరగతులు నిర్వహించే వారు. ప్రస్తుతం అవన్నీ ఏవీ అమలు కావడం లేదు. ముఖ్యంగా 2019 ఎన్నికల సందర్భంగా పోలీసులకు వారంతపు సెలవులు అమలు చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకూ నెరవేరలేదు. సెలవులు లేకపోవడంతో పోలీసులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

గాలిలో దీపంలా పోలీసుల ఆరోగ్యం




టీడీపీ పాలనలో పోలీసుల ఆరోగ్య భద్రతపై ప్రధాన దృష్టిపెట్టారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసుల పక్షపాతిగా వ్యవహరించారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీస్‌శాఖ సంక్షేమా నికి రూ.15కోట్లు కేటాయించారు. ఏడాదికి రెండుసార్లు ముందస్తుగా మెగా ఆరోగ్య పరీక్షలు చేయించారు. నిపుణులైన వైద్యులతో జిల్లా పోలీస్ కార్యాలయం వద్దే పెద్ద ఎత్తున వైద్య శిబిరాలు నిర్వహించారు. ముందస్తుగానే వ్యాధి తీవ్రతను గుర్తించి అందుకు అనుగుణంగా వైద్య పరీక్షలు అందించారు. పోలీసులతోపాటు వారి కుటుంబాలకు పరీక్షలు నిర్వహిం చారు. కానీ వైసీపీ పాలనలో ఇవేవీ అమలు కాలేదు. దీంతో వారి ఆరోగ్యం గాలిలో దీపంలా మారింది.

విచ్చలవిడిగా వైసీపీ పంపకాలు

వలంటీర్లు, బయటి వ్యక్తులతో పంపిణీ... స్థానిక నాయకుల అసంతృప్తి

బుక్కరాయసముద్రం, మే 11: మండుటెండలో సాగిన ఎన్నికల ప్రచార పర్వానికి తెర పడింది. సోమవారం పోలింగ్ జరగనుండడంతో శింగనమల నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచే ఒక్కో ఓటుకు రూ.1000 నుంచి 1500 వరకు పంపిణీ చేశారు. మందుబాబులకు కావాల్సిన మద్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో అనేక గ్రామాల్లో మందుబాబులు మత్తులో తూగుతున్నారు. యువతకు పది మంది కలిసి పట్టణాల్లో బార్లలో డిన్నర్ చేసుకోవడానికి ఒక గుంపునకు రూ. 20వేల వరకూ ఇస్తున్నారు.



క్రికెట్ క్రీడాకారులకు క్రీడాసామాగ్రి పంపిణీ చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేకు చెందిన ప్రైవేట్ కళాశాల విద్యార్థులచే వలంటీర్లు గుర్తించిన వారికి నగదును పంపిణీ చేస్తున్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారితో నగదు పంపిణీ చేయడంతో స్థానిక వైసీపీ నేతల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. పది సంవత్సరాల నుంచి పార్టీలో పనిచేస్తున్నామని, అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏ చిన్నపాటి సాయం కూడా చేయలేదని ఎమ్మెల్యేపై వైసీపీ స్థానిక నాయకులు రగిలిపోతున్నారు. ప్రస్తుతం నగదు పంపిణీలో తమకు కనీస గౌరవం ఇవ్వలేదని మండిపడుతున్నారు. ఎన్నికల రోజున పోలింగ్ వ్యవహారాలు పట్టించుకోకుండా ప్రశాంతంగా ఇంట్లోనే ఉండాలని స్థానిక నాయకులు నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

కౌన్సిలర్‌కు రూ. 5 లక్షలు ఇవ్వాల్సిందే..!

హిందూపురం అర్బన్, మే 11: మా ఊరిలో బయటి వ్యక్తుల పెత్తనం ఏమిటని హిందూపురం పట్టణానికి చెందిన వైసీపీ కౌన్సిలర్లు నాయకులతో గొడవకు దిగినట్లు సమాచారం. ఐదు సంవత్సరాలుగా పార్టీకి కష్టపడితే మమ్మల్ని నమ్మకుండా బయటి వ్యక్తులకు పెత్తనం కట్టడమేంటని నిలదీసినట్లు ప్రచారం జరుగుతుంది. అదే విధంగా ఒక్కో కౌన్సిలర్‌కు రూ. 5 లక్షలు ఇస్తేనే పని చేస్తామని వైసీపీ నాయకులకు కొంత మంది కౌన్సిలర్లు ఖరాకండిగా చెప్పినట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలని నోటుతో ప్రభావితం చేయాలని ప్రతి వార్డులో జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి పట్టణ పరిధిలోని మోడల్ కాలనీలో ఓటుకు రూ. 2 వేలు చొప్పున అందించాలని సూచించారు. కాలనీలో తక్కువ ఇవ్వడంతో స్థానికులు గొడవకు దిగినట్లు సమాచారం. దీంతో ఆగ్రహించిన కాలనీ వాసులు మాకు మీ డబ్బు వద్దు ఇక్కడ నుంచి వెళ్లి పోవాలని, లేని పక్షంలో ఫొటోలు, వీడియోలు తీసి, పోలీసులకు, ఎన్నికల అధికారులకు అందచేస్తామని హెచ్చరించినట్లు వైసీపీ నాయకులే చర్చించుకున్నారు. దీంతో డబ్బు పంపకాలు ఆపివేసి మరుసటి రోజు పంచుదామని, కాలనీ వాసులను సముదాయించి అక్కడ నుంచి వెనుతిరిగినట్లు తెలిసింది.

కొండ గుట్టలను కొల్లగొట్టారు..!

- టిప్పర్ మట్టి రూ. రెండు వేలు
- యథేచ్ఛగా అధికారపార్టీ నాయకుల మట్టి అక్రమ రవాణా

అనంతపురం రూరల్, మే 11

అధికార పార్టీ నాయకుల అక్రమ మట్టి రవాణా దెబ్బకు కొండ, గుట్టలు కనుమరుగవుతున్నాయి. ఐదేళ్ల కాలంలో మట్టి మాఫియా యథేచ్ఛగా అక్రమ రవాణా కొనసాగించింది. అడ్డు చెప్పే అధికారులు లేకపోవడంతో కోట్ల సొమ్మును జేబుల్లో నింపుకున్నారు. అనంతపురం రూరల్ మండలంలోని ఉప్పరపల్లి, చియ్యేడు, క్రిష్ణంరెడ్డిపల్లి, నరసనాయునికుంట, మన్నీలా తదితర ప్రాంతాలను అధికార పార్టీ నాయ కులు మట్టి అక్రమ రవాణాకు కేంద్రాలుగా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు.

అనంతపురం రూరల్ ప్రాంతాలు నగరానికి ఆనుకుని ఉండటం మట్టిమాఫియాకు బాగా కలిసి వస్తోంది. నగరంలో వేస్తున్న లే అవుట్లకు, ఇతరత్ర వాటికోసం మట్టిని టిప్పర్లతో తోలి జేబులు నింపుకున్నారు. టిప్పర్ రూ.1500 నుంచి రూ.2వేలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. దూరాన్ని బట్టి మరింత ధర పెంచి వ సూలు చేసుకున్నా రు. నరసనాయునికుంట, క్రిష్ణంరెడ్డిపల్లి, ఉప్పరపల్లి తదితర ప్రాంతాల పరిధిలోని కొండ, గుట్టలు మట్టి మాఫియా అరాచకాల కు సాక్ష్యంగా కనిపిస్తున్నాయి.


క్రిష్ణంరెడ్డిపల్లి సమీపంలో కొండను తవ్విన దృశ్యం


నరసనాయుని కుంట సమీపంలో రుషికొండను తలపిస్తున్న తవ్వకాలు

మధ్యలో అమిగోస్ తవ్వకాలు..

నాయకులు ఒక వైపు మట్టిని అక్రమంగా తవ్వి, రవాణా చేసుకుని సొమ్ము చేసుకుంటుంటే..మధ్యలో అమిగోస్ అనే కంపెనీకి ఎలాంటి అనుమతులు ఉన్నాయోగాని..కొండల్లోని మట్టిని టిప్పర్లకు..టిప్పర్లు తవ్వేస్తున్నారు. నేటికి ఈ కంపెనీ తవ్వకాలు జరుగుతున్నాయి. కంపెనీకి ఎంత వరకు అనుమతులున్నాయో ఎవరికీ తెలియని పరిస్థితి. నరసనాయుని కుంట సమీపంలో కంపెనీ తవ్వకాలతో స్థానికంగా ఉన్న కొండ మరో రుషికొండను తలపిస్తోంది. రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్ల మట్టి కొండల్లోనుంచి తరలివెళ్లిపోతోంది.

మరో వెయ్యి పంపిణీకి సన్నాహాలు

- కళ్యాణదుర్గం వైసీపీకి ఓటమి భయం
- ఇప్పటికే రూ.2 వేలు పంపిణీ
- రంగంలోకి మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు





కళ్యాణదుర్గం, మే 11: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వైసీపీకి ఓటమి భయం పట్టిపీడిస్తోంది. ఎలాగైనా గెలవాలని, ప్రలోభాలతో ఓటర్లను మభ్యపెట్టేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రెండు రోజుల క్రితం ఓటుకు రూ. 2 వేలు చొప్పున ప్రతి గ్రామంలోను దాదాపు పంపిణీ పూర్తి చేశారు. మిగిలిన కొంతమందికి కూడా పంపిణీ చేస్తే విజయం మనకే వరిస్తుందన్న ధీమాతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరవర్గం భావిస్తోంది. అదనంగా మరో రూ. వెయ్యి పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ప్రతి గ్రామంలోను ప్రధాన నాయకుడిని, వలంటీర్లను వెంటబెట్టుకుని డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల ముఖ్య నాయకులతో అదనంగా మరో రూ. వెయ్యి ఇస్తే ఎలా వుంటుందని చర్చలు సాగినట్లు తెలిసింది. ఆ లెక్కన ఒక్కో మండలానికి ఎంత నగదు పంపిణీ చేయాల్సి వస్తుందోనని లెక్కలు వేసుకుంటున్నారు. ఆదివారం ఒక్క రోజు మాత్రమే వుండటంతో వైసీపీ అసమ్మతి వాదులను బుజ్జగించి నోట్లతో ఎరవేయడమే ప్రధానంగా ముందడుగు వేస్తున్నారు. దాంతో పాటు టీడీపీ అసమ్మతి వాదులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి ఎలాగైనా బేరం చేసి వైసీపీ వైపు తిప్పుకోవాలనే ఆలోచనలో వున్నారు. ఇప్పుడు ఏ గ్రామంలో చూసినా అర్ధరాత్రి 12 దాటినా ఎన్నికల వాతావరణంతో వాహనాల రద్దీ కనిపిస్తోంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచర వర్గం బలహీనంగా వున్న మండలం వైపే ప్రధాన దృష్టి సారించారు. ఇప్పటికే వారి వద్ద ఓ జాబితా వుంచుకుని దాని ఆధారంగా ఫోన్లలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు మంతనాలు సాగిస్తున్నారు. ఈ డబ్బు చాలకపోతే అదనంగా మందు బాటిళ్లు ఇచ్చేందుకు కూడా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఏదిఏమైనా కళ్యాణదుర్గం వైసీపీ ప్రలోభాల పర్వం జోరందుకున్నాయి.

పదండి.. ఓటేసొద్దాం..

ఓటు హక్కు వినియోగానికి కదిలిన యువదండు

"తొలి ఓటు వేయడానికి యువదండు సొంతూళ్లకు కదిలింది. సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరగనుండటంతో ఆయా విద్యా సంస్థలు కూడా విద్యార్థులకు సెలవు ప్రకటించాయి. దీంతో డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ వంటి కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు కళాశాలల నుంచి వారి ఊర్లకు తరలివెళ్లారు. అధిక సంఖ్యలో విద్యార్థులు తొలిసారిగా ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. తమ భవిష్యత్తు కోసం పాటుపడే నాయకులనే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలని నిశ్చయించుకున్నట్లు వారు పేర్కొంటున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వారిని ఎన్నుకోకపోతే కష్టపడి చదివిన చదువులు, సర్టిఫికెట్లు పనికి రాకుండా పోతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు."

- అనంతపురం సెంట్రల్

తొలిసారి ఓటు వేస్తున్నా: లలిత, డిగ్రీ, ఇల్లూరు



సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వేయనున్నాను. శాసనసభ, పార్లమెంట్‌లో విద్యార్థుల సమస్యలపై గళంవిప్పే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటువేసే అవకాశం తొలిసారిగా దక్కడం ఆనందంగా ఉంది. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాల్సిన అవసరముంది.

ఈ క్షణాలు మరువలేనివి: తేజేశ్వర్, డిగ్రీ, సూగేపల్లి



మొదటిసారి ఓటు వేయబోతున్న క్షణాలు మరువలేనివి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచే నాయకులనే ఎన్నుకోవాలి. ఎన్నికల్లో మాయమాటలకు తలొగ్గకుండా విద్యార్థులకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకునేలా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

అవగాహన రావాలి: గంగోత్రి, డిగ్రీ, నరసాపురం



ఓటు వినియోగంపై విద్యార్థుల్లో అవగాహన రావాలి. అప్పుడే ఎన్నికల్లో సరైన అభ్యర్థులకు ఓటువేస్తారు. అన్నీ చేశామని, ఇంకా చేస్తామని మోసపూరిత హామీలకు, వాస్తవ పరిస్థితులను బేరీజువేసుకోవాలి. కొత్త ఓటరుగా బాధ్యతాయుంగా ఓటు వేసి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి.

మార్పు అనివార్యం: ఆశాబీ, పీజీ



ఈ సార్వత్రిక ఎన్నికల్లో వేలాదిగా యువత వేయనున్న ఓటుతో రాష్ట్రంలో మార్పురానుంది. పరిశ్రమలు నెలకొల్పి, ఉద్యోగాలిచ్చే ప్రభుత్వం ఏర్పడాలని మేం ఆశిస్తున్నాం. ఈ క్రమంలో ప్రతి విద్యార్థి ఓటు వేయడానికి వారి ఊర్లకు తరలివెళ్తున్నారు. ఉన్నత విద్యనభ్యసిస్తున్న విదార్థులు ఓటుతో ప్రభుత్వ ఏర్పాటును శాసించనున్నారు.

సాగనంపాల్సిందే: అనిల్‌కుమార్, బీటెక్, తాడిపత్రి



ఇంజనీరింగ్ విద్యనభ్యసించినా అనేకమందికి ఊళ్లలో పని చేయాల్సిన దుస్థితి కల్పించిన ప్రభుత్వాన్ని సాగనంపేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారు. ప్లేస్‌మెంట్స్‌ను కల్పించాలంటే పరిశ్రమలు, ఐటీ సంస్థలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కొన్ని సంవత్సరాలుగా అలాంటి చర్యలు తీసుకున్న పాపానపోలేదు.

ఓటే భవిష్యత్తు: రేఖ, ఎంబీఏ, వైజాగ్



ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించుకునే ఓటే విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ప్రైవేట్ సంస్థలకు సమానంగా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు లభించడంలేదు. కొన్ని సంవత్సరాలుగా ప్రైవేట్ సంస్థల్లోనూ ఉద్యోగాలు దొరకడంలేదు. యువతకు జాబ్‌లిచ్చే ప్రభుత్వాన్ని ఎన్నుకుంటాం.

సమస్యలకు పరిష్కారం.. : హేమంత్‌కుమార్, ఎంబీఏ



అభివృద్ధిని పరుగులుపెట్టించి ప్రజలకు సమాన సంక్షేమాన్ని అందించే మంచి ప్రభుత్వాన్ని విద్యార్థులు ఎన్నుకోనున్నారు. విద్యార్థుల సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించే వారినే ప్రజా ప్రతినిధులుగా చట్టసభలకు పంపేలా సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేస్తాం. దీంతో విద్యావ్యవస్థ పటిష్ఠపడి విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

రారాజులా ఒక్కరోజు: నిఖిల్‌భూషణ్, ఎంబీఏ, అనంతపురం



ఎన్నికల రోజు ఓటువేసే ప్రతి విద్యార్థి రారాజే. ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం ఒక్క ఓటుతోనే సాధ్యం. అభ్యర్థుల గుణగణాలు, వారి సేవాదృక్పథం, విద్యార్హత వంటివి ప్రజా ప్రతినిధి సమర్థతను తెలియ జేస్తాయి. అన్నిటినీ పరిశీలించి ఓటు వేస్తాం.

ప్రణాళిక ఉన్న వారికే..: గంగాధర్, పీజీ



నాణ్యమైన ఉన్నత విద్యనందించి, సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మంజూరుచేసేలా ప్రణాళికున్న ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే వారికే ఓటు వేస్తాం. లేకుంటే పరీక్షలు రాయాలన్నా, సర్టిఫికెట్స్ పొందాలన్నా నో డ్యూస్ సర్టిఫికెట్‌తో ఇబ్బందులు పడాల్సివస్తుంది. ఇలాంటి సమస్యలకు ఓటుతో చెక్‌పెట్టాలి.

కొత్తకొత్తగా ఉంది: అరవింద్, బీటెక్, ఉరవకొండ



రాష్ట్రాన్ని పాలించే నాయకులను మేము కూడా ఎన్నుకోబోతున్నామన్న భావన కొత్తకొత్తగా అనిపిస్తోంది. గతంలో ఓటువేసి చూపుడు వేలిపై ఉన్న సిరా చుక్కను చూపేవాళ్లను ఆశ్చర్యంగా చూశాం. ఇప్పుడు అవకాశం మాకు వచ్చింది. అందుకే ప్రస్తుత పాలన మార్పు దిశగా పోలింగ్ కేంద్రాల వైపు అడుగులు వేస్తున్నాం.

సైలెంట్ ఓటింగ్‌పై గంపెడాశలు



పోలింగ్ సమయం దగ్గర పడుతుండడంతో పార్టీల అభ్యర్థులు చివరి ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు అభ్యర్థుల్లో టెన్షన్ పెరిగిపోతోంది. ప్రధానంగా సైలెంట్ ఓటింగ్‌పై పార్టీలు గంపెడాశలు పెట్టుకున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో సభలు, సమావేశాలు, రోడ్‌షోలు నిర్వహించారు. ప్రచారాలు బహిరంగసభల ద్వారా జనాల్లోకి వెళ్లినప్పటికీ తమకు ఓట్లు పడతాయో లేదోనని అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఉరవకొండలో భిన్న రాజకీయ వాతావరణం ఉంటుంది. ఉరవకొండపైనే ప్రధానపార్టీలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ దృష్టి సారించాయి. ఇక్కడ వచ్చే మెజార్టీనే అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తుంది. అన్ని పార్టీలు ముమ్మరంగా ప్రచారం చేశాయి. ఓటర్ల మద్దతు తమకంటే తమకే అన్న నమ్మకంతో ఉన్నారు. ఇక్కడి ఓటర్ల నాడీ పట్టడం కష్టంగా మారింది. ముఖ్యంగా సైలెంట్ ఓటింగ్ కీలకంగా మారనుంది. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సోదరుడు మధుసూదనరెడ్డి చీల్చే ఓట్లు కీలకం కానున్నాయి. వైసీపీకి చెందిన ఓట్లే చీలే అవకాశాలు ఉన్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

- ఉరవకొండ

అక్కడి చుక్క.. ఇక్కడి ముక్క



సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో వైసీపీ నాయకులు మండల ఓటర్లకు కర్ణాటక మద్యం, ఆంధ్రా బిర్యానీ అందించి ప్రసన్నం చేసుకోవడానికి తంటాలు పడుతు న్నారు. కొన్ని గ్రామాలలో ఇంటికో కోడి, కర్ణాటక మద్యాన్ని అందించి నగదును కూడా పంపిణీ చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాలలో ఎటు చూసినా సందడి నెలకొంది. వైసీపీ నాయకులు అందిస్తున్న డిన్నర్లలో అనేక మంది యువకులు కూడా పాలుపంచుకుంటున్నారు. ఆంధ్రాలో మద్యం కొనుగోలుకు అనేక ఆంక్షలు ఉండటంతో పక్కనే ఉన్న బళ్లారి, మొలకాల్మూరు, రూపనగుడితో పాటు పలు ప్రాంతాల నుంచి విచ్చలవిడి గా మద్యాన్ని డంపింగ్ చేస్తూ పురుష ఓటర్లకు గాలం వేస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా ఉండటంతో పాటు అన్ని సర్వేలు టీడీపీ కూటమియే విజేత అని చెబుతుండటంతో వైసీపీ నాయకుల్లో అలజడి నెలకొంది. ఓటర్లను ఏ విధంగానైనా తమ బుట్ట వేసుకోవాలన్న ధృడసంకల్పంతో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా మద్యం, బిర్యానీ, నగదు ఆశ చూపుతున్నారు.

- కణేకల్లు

ఓటుకు పోదాం చలో..



మరూరు టోల్ ప్లాజా వద్ద బెంగళూరు నుంచి వస్తున్న కార్లు

- స్వగ్రామాలకు తరలివస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు
- మరూరు టోల్ ప్లాజా వద్ద పెరిగిన వాహనాల రద్దీ

రాప్తాడు/మడకశిర, మే 11: సాధారణంగా సంక్రాంతి పండుగ సందర్భంగా టోల్‌గేట్ల వద్ద విపరీతమైన రద్దీ ఉంటుంది. నగరాల నుంచి పల్లెలకు కార్లలో కుటుంబాలతో కలిసి వెళ్లే వారితో సందడి ఉంటుంది. కానీ ఈసారి ఎన్నడూ లేనంతగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఓటు వేసేందుకు స్వగ్రామాలకు తరలి వస్తున్నారు. సోమవారం జరిగే సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై ఇతర నగరాల్లో పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఇతర ఉద్యోగాలు కుటుంబ సభ్యులతో కలిసి ఊరి బాట పట్టారు. రాప్తాడు మండలంలోని మరూరు టోల్ ప్లాజా వద్ద ఇతర రోజుల్లో వాహనాల రద్దీ సాధారణంగా ఉండేది. శనివారం నుంచి వాహనాల రద్దీ భారీగా పెరిగింది. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు లేక చాలామంది బెంగళూరు, మైసూరు తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. పండుగలకు గ్రామాలకు వచ్చివెళ్లేవారు. ప్రస్తుతం ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు తిరిగి స్వగ్రామాలకు వస్తున్నారు.

హిందూపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు చాలా మంది ఓటర్లు సొంత ఊర్లకు చేరుకున్నారు. మిగిలిన వారు సోమవారం పోలింగ్ ప్రారంభం అయ్యే సమయానికి చేరుకుని అవకాశం ఉంది. ఐదేళ్ల కిందట ఒక్క చాన్సు ఇచ్చినందుకు ఉన్న ఊర్లో ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి పొట్టపోసుకుంటున్న తాము ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామంటున్నారు. తమ ఓటును ఉపాధి కల్పించి, సుపరిపాలన అందించే వారికి వేయాలనే పట్టుదలతో రెండు రోజుల ముందే హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి హిందూపురం చేరుకున్నారు.

ఓటు వేసేందుకు ఊరికి వస్తున్నా



మా స్వగ్రామం గార్లదిన్నె. నేను బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నా. సోమవారం జరిగే ఎన్నికల్లో ఓటు వేసేందుకు మా ఊరికి వచ్చా. రాష్టాన్ని అభివృద్ధి చేసే నాయకుడికే నా ఓటు వేస్తాను. బెంగుళూరులో పని చేసే వేల మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంత ఊళ్లకు వస్తున్నారు.

-మనోజ్, గార్లదిన్నె

ఓటు హక్కును వినియోగించుకోవాలి



మాది అనంతపురం నగరం. నేను బెంగుళూరు నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నా. ఓటు కోసం అనంతపురం వచ్చా. ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఉద్యోగులు భారీగా తరలివస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి. మంచి నాయకుడిని ఎన్నుకోవాలి.

- రామకృష్ణ, అనంతపురం

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



స్థానికంగా ఎటువంటి ఉపాధి అవకాశాలు లేక పోవడంతో బెంగళూరుకు వెళ్లి వ్యాపారం చేసుకుంటు జీవనం సాగిస్తున్నాం. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి దొరుకుతుంది. నాకు మూడు ఎకరాలు భూమి ఉన్నా వర్షాలు కురవకపోవడంతో పంటసాగు చేయలేక బీడుగా వదిలే పరిస్థితి దాపురించింది. ఎన్నికలప్పుడు స్వగ్రామానికి వచ్చి ఓటు వేసి వెళతుంటాం.

- సుధాకర్, హేమావతి, అమరాపురం మండలం



హిందూపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సందడి

ఏం కష్టమొచ్చింది మామా..!





అనంతపురంలో మద్యం దుకాణం వద్ద బారులుతీరిన జనం, బార్ అండ్ రెస్టారెంట్ వద్ద మందుబాబులు

పోలింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను శనివారం సాయంత్రం 6 గంటలకు మూసేశారు. ఎక్సైజ్ అధికారులు సీల్ వేశారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు తెరవరు. పోలింగ్ ముగిశాక, జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో తెరుస్తామని, ఆ రోజు.. ఆ సమయానికి ఎక్కడైనా ఘర్షణ వాతావరణం నెలకొనే పరిస్థితులు ఉంటే.. కలెక్టర్ ఆదేశాల మేరకు పూర్తిగా బంద్ చేస్తామని తెలిపారు. ఇదే జరిగితే 14వ తేదీన మద్యం దుకాణాలను తెరుస్తారు. బంద్ నేపథ్యంలో అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మద్యం కోసం పలువురు ఎగబడ్డారు.



మద్యం దుకాణానికి సీలు

కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటలకే దుకాణాలను మూసేశారు. సిబ్బందిలో కొందరు వైసీపీ నాయకులకు పెద్ద మొత్తంలో ఒకేసారి మద్యం ఇచ్చేశారని తెలిసింది. అందుకే సాధారణ మద్యం ప్రియులకు సరుకు దొరకలేదని అంటున్నారు. కొన్నిచోట్ల నచ్చిన బ్రాండ్లు లేకపోయినా ఏదో ఒకటి ఇవ్వండి అని తీసుకెళ్లారు. ప్రభుత్వ దుకాణాల్లో మద్యం స్టాక్ లేకపోవడంతో కొందరు బార్ అండ్ రెస్టారెంట్లకు వెళ్లారు. అదనంగా డబ్బులు వెచ్చించి కొనుగోలు చేశారు.

- అనంతపురం అర్బన్

ఎన్డీఏతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

అనంతపురం లోక్‌సభ టీడీపీ కూటమి అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ



మర్తాడులో ప్రచారం చేస్తున్న అంబికా లక్ష్మీనారాయణ

గార్లదిన్నె, మే 11 : ఎన్డీఏ ప్రభుత్వంతోనే దేశంతో పాటు రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని అనంతపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గార్లదిన్నె, బుక్కరాయసముంద్రం మండలాల్లోని గార్లదిన్నె, మర్తాడు, వెంకటాపురం, దయ్యాలకుంటపల్లి తదితర గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అంబేడ్కర్, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత నవ్యాంధ్రప్రదేశ్‌ను చంద్రబాబునాయుడు అభివృద్ధి దిశగా పయనింపచేశాడన్నారు. గత ఎన్నికల్లో జగన్‌రెడ్డి అబద్ధపు హామీలకు ఆకర్షితులై వైసీపీకి పట్టం కట్టారన్నారు. దీంతో రాష్ట్రం 50 ఏళ్ల వెనక్కు వెళ్లిపోయిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క రంగం అభివృద్ధి సాధించలేదన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగ శాతం పెరిగిపోయిందని తెలిపారు. సైకో జగన్ పాలనకు భయపడి పరిశ్రమలు కూడా వెనుతిరిగాయన్నారు. అసాంఘిక శక్తులు పేట్రేగిపోయాయన్నారు. దేశంలో గంజాయికి ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందన్నారు. నకిలీ మద్యం, మైనింగ్, శాండ్ తదితర పకృతి సంపదను వైసీపీ నేతలు పెద్దఎత్తున అక్రమంగా తరలించి వేలాది కోట్లు కొల్లగొట్టారని మండిపడ్డారు. రాష్ట్రం, మన పిల్లల భవిష్యత్ బాగుపడాలంటే ఎన్డీఏ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పాలిస్తేనే రాష్ట్రం తిరిగి అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా దూసుకుపోతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి దేశ, రాష్ట్ర సమగ్రావృద్ధికి పాటుపడాలని కోరారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు, 14 అసెంబ్లీ స్థానాల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేయనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గేటుక్రిష్టారెడ్డి, ఇల్లూరు రామాంజి, ఆవులక్రిష్ణ, పుల్లన్న, గోరకాటి వెంకటేసు, సుబ్బయ్య, శేఖర్, గోపాల్, కొడిదల రామకృష్ణ, రఘురాముడు, సూరి, ఈశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రానికి రక్షణ

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

టీడీపీ కూటమి పురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి



ర్యాలీలో మాట్లాడుతున్న బీకే

పుట్టపర్తి, మే 11 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నాశనం చేసిన జగన్ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే ఎన్డీఏ కూటమి గెలవాలని హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి కోరారు. శనివారం ఎన్నికల ప్రచారం ముగింపులో భాగంగా ధర్మవరం నియోజక వర్గం ముదిగుబ్బలో బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఓటమి భయంతో ధర్మవరం, తగరకుంట, తోపుదుర్తిలో టీడీపీ, బీజేపీ కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి దాడులకు భయపడేది ప్రసక్తేలేదని ఎన్నికల్లో ఎలాంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొంటామని అన్నారు. ఆంధ్రప్రజానీకమంతా ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలంటే రాష్ట్రంలో చంద్రబాబు, కేంద్రంలో నరేంద్రమోదీ రావాలన్నారు. ఐదేళ్లుగా అరాచక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను గద్దెదింపాలన్నారు. ప్రజలు అందరూ ఈనెల 13న జరిగే ఓటింగ్‌లో పాల్గొని రాష్ట్రం, కేంద్రంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలిపించాలని కోరారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వలస వెళ్లిన వారందరూ వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా దూసుకెళ్తుందన్నారు. హిందూపురం పార్లమెంట్‌తోపాటు అన్ని నియోజక వర్గాల్లో సంక్షేమం, అభివృద్ధి ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపుతోనే సా ధ్యమన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామి గా, ప్ర గతి పథంలో నడిపిస్తామని ఎన్డీఏ కూటమిని ఆశీర్వదించాలని కోరారు.

ష్.. ష్...

ముగిసిన ప్రచారం..మూగబోయిన మైకులు

నేడు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి



అనంతపురం టౌన్, మే 11: సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది. దీంతో ఇన్నాళ్లు నాయకుల గళాలతో హోరెత్తిన మైకులు మూగబోయాయి. గడువు ముగిశాక ఎవరైనా ప్రచారాలు సాగించినా, ర్యాలీలు చేపట్టినా, సమావేశాలు పెట్టినా చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు వినోద్‌కుమార్ హెచ్చరికలు జారీ చేశారు. ప్రచారాలు ముగియడంతో ఇక ఎన్నికల పోలింగ్ పై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. గత మూడు నెలలుగా ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం కుస్తీ పడుతూ వచ్చినా, కొత్త కలెక్టరు వినోద్‌కుమార్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి కృషి చేస్తున్నారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ చేపట్టి ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. ఎన్నికల నిర్వహణ కు అవసరమైన పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలకు కలిపి 2,236 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు 2,472మంది పీఓలు, 2,552 మంది ఏపీఓలు, 10,208మంది ఓపీఓలను నియమించారు. వీరితో పాటు మైక్రో అబ్జర్వర్లు 544మందిని నియమించారు. వీరందరు ఆదివారం వారికి కేటాయించిన నియోజకవర్గాల కేంద్రాలకు చేరుకుంటారు. అక్కడ ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఇతరసామగ్రి తీసుకుని కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు పటిష్ట భద్రత మధ్య వెళ్తారు.

రేపు ఏడు గంటల నుంచి పోలింగ్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం ఏడుగంటల నుంచి మొదలై సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుంది. జిల్లా వ్యాప్తంగా 2,236 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎనిమిది నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహణకు 8,324 బ్యాలెట్ యూనిట్లు, 5,074 కంట్రోల్ యూనిట్లు, 6,188 వీవీప్యాట్లు వినియోగిస్తున్నారు.

పోలింగ్ సజావుగా జరుపుతాం

- కలెక్టరు, ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు, ఎస్పీ

అనంతపురం టౌన్, మే11: అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు ఏర్పాటు చేసి, పోలింగ్ సజావుగా జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టరు వినోద్ కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం సీపీఎఫ్ కమాండెంట్‌లతో వారు సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోలింగ్ సమయంలో సీపీఎఫ్ కమాండెంట్‌ల పాత్ర చాలా కీలకమన్నారు. జిల్లాలో పలు క్రిటికల్ కేంద్రాల ను గుర్తించి అక్కడ ప్రశాంతంగా పోలింగ్ జరగడానికి కేంద్రబలగాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ స్టేషన్‌లలోను వందశాతం వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు మీడియా, ఎన్నికల అధికారులకు పాస్‌లు జారీ చేశామని, అవి ఉన్న వారిని మాత్రమే కేంద్రాలలోకి అనుమతించాల న్నారు. ఓటర్లు, అభ్యర్థులు, ఏజెంట్లతో మర్యాదగా వ్యవహరించాలన్నారు.

ఏమప్పా.. ఎంతిచ్చినారు..?



బొమ్మనహాళ్, మే 11: ఏమప్పా సోమవారమే ఓటు వేసేది.. యా పార్టీవాళ్లు ఎంతిచ్చార్రప్పా.. వాళ్లేమో రూ. 1500 ఇచ్చారు. మరొకరు ఇంకా రాలేదంటున్నారు.. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న వేళ నలుగురు ఎక్కడ కలిసినా ఇవే చర్చలు. సామాజిక, ఆర్థిక, రాజకీయాల విషయాల గురించి సంభాషణలే. హోటళ్లు, బార్బర్‌షాప్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో రచ్చకట్ట దగ్గర ఏ నలుగురు కూర్చున్నా రాజకీయంపైనే చర్చ జరుగుతోంది. ఉదయం, సాయంత్రం స్థానిక రాజకీయ నాయకులతో పాటు రాష్ట్ర, జాతీయ రాజకీయ అంశాలు కూడా చర్చించుకుంటున్నారు. అక్కడక్కడా వాదోపవాదాలు, సవాళ్లు కూడా కనిపిస్తున్నాయి.

దాడికి పాల్పడిన వారిని
వెంటనే అరెస్టు చేయాలి

● కూటమి శ్రేణుల డిమాండ్


నల్ల తువాళ్లతో ఆందోళన చేస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీకే పార్థసారధి

ధర్మవరం, మే 11: టీడీపీ మాజీ కౌన్సిలర్ మాదన ఉమామహేశ్వరి, ఆమె కుటుంబసభ్యులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన వైసీపీ నాయకులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని పట్టణంలోని కూటమి శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం నల్లతువాళ్లు భుజంపై వేసుకుని స్థానిక కొత్తపేటలోని మాదన ఉమామహేశ్వరి నివాసం వద్ద నుంచి గాంధీనగర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ కొద్దిసేపు ఆందోళన చేశారు. అనంతరం వైసీపీ వారికి మంచి బుద్ధి ప్రసాదించమని గాంధీవిగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తర్వాత బాధితురాలు మాదన ఉమా మహేశ్వరి మాట్లాడుతూ.. మా వార్డుతో ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు మా ఇంటికి వచ్చి తనను, తన భర్తతో పాటు పిల్లలను సైతం బయటకు ఈడ్చి మారణాయుధాలతో దాడి చేశారని వాపోయారు. ధర్మవరంలో వైసీపీ గుండాయిజానికి ఎదురులేకుండా పోతోందన్నారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు బీసీలనే టార్గెట్ చేసి హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారని అన్నారు. తమపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గిర్రాజునగేశ్, జింకా రామాంజినేయులు, లోకేశ్, పరిశేసుధాకర్, మాదన సుబ్బయ్య, శీలామూర్తి, బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి బీకే పరామర్శ..

మాజీ కౌన్సిలర్ మాదన ఉమామహేశ్వరి కుటుంబాన్ని హిందూపురం పార్లమెంట్ కూటమి టీడీపీ అభ్యర్థి బీకేపార్థసారథి పరామర్శించారు. బాధితులను ఇంటికి వెళ్లి పరామర్శించారు. సంఘటనా వివరాలను ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ రెండు రోజుల్లో పోలింగ్ పెట్టుకుని వైసీపీ నాయకులు దాడులకు తెగబడటం దారుణమన్నారు. వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

‘యువత భవిష్యత్తు కోసం.. బాబు రావాలి’


బుక్కపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బుక్కపట్నం, మే 11: యువత భవిష్యత్తు కోసం, 20లక్షమందికి ఉద్యోగాల కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని టీడీపీ యువ నాయకుడు కెంపరాజ్ రాజశేఖర్ గౌడ్, టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శనివారం వారు ఈ మేరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ సాగింది. ఇందులో రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రానికి పరిశ్రమలు, యువతకు ఉపాధి అవకాశాలు రావాలంటే చంద్రబాబు సీఎం కావాలని అన్నారు. అందుకు ప్రజలు కూటమిని గెలిపించాలని కోరారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమితోనే గ్రామాల అభివృద్ధి


గంటాపురంలో ప్రచారం చేస్తున్న కమలమ్మ, త్రివేణి తదితరులు

బత్తలపల్లి, మే 11: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి రావాలని ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి సతీమణి కమలమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ సతీమణి త్రివేణి పేర్కొన్నారు. మండలంలోని గంటాపురం గ్రామంలో శనివారం వారు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సత్యకుమార్ యాదవ్‌ను, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బీకే పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాల గురించి వివరించారు. కూటమిని గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

● ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర


రోడ్‌షో చేస్తున్న మాజీ మంత్రిపల్లె రఘునాథ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర

ఓబుళదేవరచెరువు, మే 11: ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని, గెలిచాక నియోజకవర్గాన్ని అన్ని రంగాలుగా అభివృద్ధి చేస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర పేర్కొన్నారు. మండలంలోని కొండమకర్లపంచాయతీ కేంద్రంలో శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. స్థానిక ప్రజలు, నాయకులు పూలవర్షం కురిపిస్తూ.. ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. తర్వాత వారు రోడ్ చేశారు. ఇందులో సింధూరారెడ్డి మాట్లాడుతూ 13వ తేదీన జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. తాను గెలిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలు గత 27 ఏళ్లుగా తన మామ పల్లె రఘునాథరెడ్డిని ఎంతో ఆదరించి, అభిమానించారన్నారు. అనేక ఉన్నత పదవులు రావడానికి సహకరించారని గుర్తు చేశారు. తన మామ సైతం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. ఆయన చేసిన పనులే ఇప్పుడు కనబడుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. పైగా ప్రజల కోసం వచ్చే సత్యసాయి తాగునీటిని కూడా ఆయన తన తోటకు వాడుకున్నారని దుయ్యబట్టారు. అలాంటి అరాచక ఎమ్మెల్యేకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల వల్ల ఎంతో లబ్ధి చేకూరుతుందని వివరించారు. కూటమి గెలుపునకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పిట్టా ఓబులరెడ్డి, నాయకులు ఎద్దుల ప్రమోద్‌రెడ్డి, పొగాకు షఫీ, జాకీర్, బడిశం రామాంజనేయులు, సర్పంచ్ రేణుకాబాయి, జెరిపిటి అంజనప్ప, షాన్వాజన్, గంగాధర్, గంగాద్రి, జనసేన మండల కన్వీనర్ మేకల అశ్వర్థ, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం


పుట్టపర్తిలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు


సైదాపురంలో తెలుగుయువత నాయకుల ప్రచారం


ఓడీసీ మండలం గంటాపురంలో టీడీపీ శ్రేణుల ప్రచారం


తనకల్లు మండలం కొర్తికోటలో..

పుట్టపర్తి మే 11: పట్టణంలోని ప్రధాన రహదారిలో కూటమి నాయకులు, కార్యకర్తలు శనివారం సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు కరపత్రాలు పంచుతూ వివరించారు. ఆ పథకాల వల్ల కుటుంబంలో ఎవరెవరికి ఏమేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారన్నారు. కనుక కూటమిని గెలిపించాలని కోరారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి పల్లె సింధూరను ఎమ్మెల్యేగా, బీకే పార్థ సారధిని ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు రామలక్ష్మణులు, పీసీ గంగన్న, అబ్దుల్, చింతాదామోదర్, బాలగంగాధర్, షామీర్, సర్వేశ్వరరావు, యాసిన్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: పట్టణంలోని సైదాపురంలో తెలుగుయువత నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వాటి వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అవి అమలవుతాయని చెప్పారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, రేవంత్, శివ, గణేష్‌నాయుడు, గంగయ్యనాయుడు, శివాచౌదరి, పోలినేని క్రిష్ణ, సందీప్, ప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని గంటాపురం పంచాయతీలో సూపర్ సిక్స్‌పథకాలపై శనివారం టీడీపీ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. అనంతరం ఈవీఎం నమూనాను ఓటర్లు ఎలావినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. కూటమి అభ్యర్థులు పల్లె సింధూరారెడ్డి, బికె. పార్థసారధికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జీ నారప్పరెడ్డి, ఎంపీటీసి శ్రీనివాసులు, రఘునాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఆటో రామాంజి, శ్రీనివాసరెడ్డి, తదితరులున్నారు.

తనకల్లు: మండలంలోని కొర్తికోట పంచాయతీలో టీడీపీ నాయకులు ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. సీనియర్ నాయకుడు ఎస్‌కె మస్తాన్‌వలి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మంజునాథ్, హనుమంతురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెద్దపల్లికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్ బోర్డు సభ్యుడు డాక్టర్ పీ. ముక్తియార్ బాషా మల్లిరెడ్డిపల్లి పంచాయతీలోని పెద్దపల్లి, నక్కరాళ్లతండా, వడ్డుమరువపల్లి, నడిమికుంటపల్లి, సబ్బరాయునిపల్లి, కొత్తకురవపల్లి, ఎర్రబల్లి, ఎర్రగుట్టపల్లి, బాబేనాయక్‌తండా, గుర్రంబైలు గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటేసి కూటమి అభ్యర్థిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరినాయక్, చంద్రశేఖర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, బాలాజీనాయక్, మాజీ సర్పంచ్‌లు శివరామ్, నాగమల్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి: ఆర్వో

ధర్మవరం, మే 11: నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో ఈనెల 13 వ తేదీన నిర్వహించే ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 13వ తేదీన పోలింగ్ బూత్‌లలో కూర్చునే ఏజెంట్లు నియామకంలో ఫారం-10ని భర్తీ చేసి తగిన సంతకాలతో నేరుగా ఆయా పోలింగ్ బూత్‌ల పీఓలకు వెంటనే చేర్చాలన్నారు. నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మార్కెట్‌యార్డ్‌లో పీఓ, ఏపీఓలకు ఆదివారం పోలీసుబందోబస్తు నడుమ ఎన్నికల సామగ్రిని అందజేస్తామన్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. కావున ప్రతి ఓటరు ఓటు హక్కును తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆర్వో తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

గాండ్లపెంట, మే 11: ఈనెల 13వ తేదీన జరుగు సార్వత్రిక ఎన్నికల్లో నిబంధనలను మండలంలోని ప్రజాప్రతినిధులు, ఓటర్లు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణవేణి శనివారం ప్రకటనలో హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు కూడా ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదన్నారు. ఎక్కడపడితే అక్కడ గుంపులుగా ఉండకూడదన్నారు. ఆది, సోమవారాల్లో గ్రామాల్లో 144 సెక్షన్, 30ఏ యాక్టు అమలులో ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. పోలింగ్ రోజున ఐదు మొబైల్ టీమ్‌లు, సీఐ, డీఎస్పీ ఆధ్వర్యంలో పర్యవేక్షణ నిర్వహిస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

మగ్బూల్‌పై వైసీపీ శ్రేణుల గుర్రు !

- గ్రామస్థాయి నాయకులను నమ్మని ఎమ్మెల్యే అభ్యర్థి
- సొంత టీమ్‌తో తాయిలాల పంపిణీ
- నిరుత్సాహంలో నాయకులు, కార్యకర్తలు
- అభ్యర్థిపై తీవ్ర అసంతృప్తి

కదిరి, మే 11: నియోజకవర్గంలోని వైసీపీ శ్రేణులు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తీరు నచ్చక గుర్రుగా ఉన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గ్రామస్థాయిలోని వైసీపీ నాయకులను నమ్మకుండా తన సొంత టీమ్‌తో తాయిలాలు పంచినట్లు సమాచారం. దీనిపై స్థానిక నాయకత్వం అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. గ్రామస్థాయిలోని నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించడం లేదు. 2019 ఎన్నికల్లో ఉన్న ఉత్సాహం ఇప్పుడు ఇసుమంతైనా కనిపించలేదని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. ఇలా అయితే ఎన్నికల రోజు పోల్ మేనేజ్‌మెంట్ చేయలేమని నియోజకవర్గ స్థాయి నాయకులు సైతం మదనపడుతున్నట్లు సమాచారం. గ్రామస్థాయి నాయకులు మాత్రం తమను కాదని సొంత టీమ్‌తో తాయిలాలు పంపిణీ చేశారని, గ్రామస్థాయిలో ఎవరు ఓట్లు వేయిస్తారో చూద్దామని నాయకులతో సవాలు చేసినట్లు సమాచారం. ప్రస్తుత ఎన్నికల్లో అత్యంత అనుభవం కలిగిన కందికుంట వెంకటప్రసాద్ టీడీపీ కూటమి నుంచి పోటీ చేస్తుంటే.. ఏమాత్రం రాజకీయ అనుభవం లేని మగ్బుల్ అహ్మద్ వైసీపీ నుంచి బరిలో ఉన్నారు. అయితే ఈయన నాయకత్వం తీరు నచ్చక తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు గ్రామ స్థాయి నాయకులు చెబుతున్నారు. మమ్మల్ని నమ్మని అతడికి పోలింగ్ రోజు ఎవరు ఓట్లు వేయిస్తారో చూస్తామని అంటున్నారు.

గ్రామస్థాయి నాయకులను నమ్మని వైసీపీ అభ్యర్థి..

ఏ పార్టీకైనా కార్యకర్తలే ప్రధానం. ఎన్నికల్లో గెలవాలంటే వారిదే ముఖ్యమైన పాత్ర. అయితే ఎమ్మెల్యే అభ్యర్థి గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలను నమ్మకుండా మాజీ వలంటీర్లు తోపాటు మరికొంత మంది వలంటీర్లను లోపాయికారిగా తాయిలాల పంపిణీలో వాడుకున్నట్లు సమాచారం. దీనిపై స్థానిక నాయకులు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ అభ్యర్థి తమను నమ్మకుండా సొంత టీమ్ ఏర్పాటు చేసుకున్నారని, వారితోనే ఎలక్షన్ చేయించుకోవాలని చెబుతున్నట్లు తెలిసింది. నియోజకవర్గంపై ఎలాంటి అవగాహన లేనివారికి టిక్కెట్లు ఇచ్చారని గ్రామస్థాయి కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. తమను నమ్మని వారికి తాము పనిచేసేదే లేదని కరఖండిగా చెబుతున్నట్లు సమాచారం.

2019లోని ఉత్సాహమేదీ?

2019 ఎన్నికల్లో గ్రామ గ్రామాన వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పనిచేశారు. జగన్ ఒక్కఛాన్స్ పేరుతో పిలుపు ఇవ్వడంతో ప్రతిఒక్కరూ తమ నాయకున్ని ముఖ్యమంత్రిని చేయాలని ఉత్సాహంతో పనిచేశారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో ఆ ఉత్సాహం ఇసుమంతైనా కనిపించడం లేదు. అన్ని గ్రామాల్లోని కార్యకర్తలు, నాయకులు నిస్సత్తువగా ఉండడం కనిపించింది. దీనికి కారణం పార్టీ కోసం ముందు నుంచి పని చేసిన వారిని కాదని రెడీమేడ్ నాయకులను బరిలోకి దించడమే అని పలువురు కార్యకర్తలు అంటున్నారు. పార్టీలో కొనసాగుతున్న తమను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఎన్నికలకు దూరంగా ఉంటున్నట్లు కొంతమంది అంటున్నారు. వైసీపీ అభ్యర్థి ఓ సామాజిక వర్గానికే పెద్దపీట వేస్తున్నారన్న ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. అందువల్ల చాలామంది ఎన్నికలకు దూరంగా ఉండడానిని సిద్ధమైనట్లు సమాచారం.

పోల్ మేనేజ్‌మెంట్ డౌటే..

ఎన్నికల్లో ముఖ్యంగా ఓటర్లను బూత్‌వరకు తీసుకురావడం అతి ముఖ్యమైన పని. ఇది కార్యకర్తలే చేయగలుగుతారు. ప్రస్తుతం వైసీపీ కార్యకర్తలు ఎక్కువమంది ఎమ్మెల్యే అభ్యర్థిపై ఆగ్రహంగా ఉండడంతో పోల్ మేనేజ్‌మెంట్ అనుమానమే అని చర్చ జరుగుతోంది. కనీసం కార్యకర్తలకు ఖర్చులు కూడా డబ్బు ఇవ్వలేదని కొంతమంది చర్చించుకున్నట్లు తెలిసింది. గ్రామాల్లో ఏ ఒక్కరికో, ఇద్దరికో ఇచ్చి, మిగిలినవారిని విస్మరించారని సమాచారం. ముఖ్యంగా మాజీ వలంటీర్లు, తదితరులపైనే పోల్ మేనేజ్‌మెంట్ వదిలేశారని, వారితో పోల్ మేనేజ్‌మెంట్ చేయించడం ఇబ్బందే అని పలువురు చర్చించుకుంటున్నారు.

కందికుంట స్పీడ్‌ను తట్టుకోగలమా..

కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఈఎన్నికల్లో చాలా దూకుడుగా ఉన్నారు. ఆయన స్పీడ్‌కు తట్టుకోలేమని పలువురు వైసీపీ కార్యకర్తలు చర్చించుకుంటున్నట్లు తెలిసింది. పలు గ్రామాలు, వార్డుల్లో టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారని తమ నాయకున్ని గెలిపించుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారని సమాచారం. పోల్ మేనేజ్‌మెంట్‌లో కందికుంట టీమ్‌తో పోటీ పడగలమా అని అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. వారి దూకుడుకు తట్టుకునే సామర్థ్యం తమ అభ్యర్థికి లేదని వైసీపీ వారే చెబుతున్నారు.

కూటమి అభ్యర్థులకు నీరాజనం

● రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు, కూటమి శ్రేణులు


ల్యాండ్ టైటిలింగ్ జీవో ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ, మే11: సార్వత్రిక ఎన్నికల చివరిరోజు ప్రచారంలో భాగంగా శనివారం కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు సత్యకుమార్ యాదవ్, బీకే పార్థసారధి ముదిగుబ్బలో రోడ్‌షో నిర్వహించారు. కూటమి శ్రేణులు భారీ సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో కమలా పండ్లతో ఏర్పాటు చేసిన గజమాలతో కూటమి అభ్యర్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీకే పార్థసారధి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ముదిగుబ్బలో ఉన్న తాగునీరు, డ్రైనేజీ , సీసీరోడ్లు, హిందూ శ్మశాన వాటిక, మైనార్టీలకు ఈద్గా, ఖబరస్థాన్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కూటమిని గెలిపించాలని కోరారు. తర్వాత సత్యకుమార్ మాట్లాడుతూ తనను ఎంతగానో ఆదరించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. అధికారంలోకి వస్తే ప్రజలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. మహిళలకు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. మండల కేంద్రాల్లో 30 పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన ప్రతిపేదకుటుంబానికి సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. చిత్రావతి, జిల్లేడుబండ ముంపు రైతులకు న్యాయమైన పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో ఐదేళ్లు వెనక్కు పోయిందన్నారు. జగన్ అరాచక పాలన సాగించారన్నారు. అభివృద్ధి పనులు ఏమాత్రం చేపట్టలేదన్నారు. ఎన్నో హామీలిచ్చా ఎక్కటీ నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజల్ని మోసం చేశారన్నారు. ఇక ఎమ్మెల్యే కేతిరెడ్డి అవినీతి చెప్పక్కర్లేదన్నారు. ఆయన తిన్న అవినీతి సొమ్మునంతా త్వరలోనే కక్కిస్తానన్నారు. కూటమి శ్రేణుల జోలికొస్తే తాట తీస్తామంటూ హెచ్చరించారు. అనంతరం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో ప్రతులను వారు కూటమి నాయకులతో కలిసి దహన చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కూటమి అభ్యర్థుల రోడ్‌షోతో ముదిగుబ్బ పట్టణం జనసంద్రమైంది.


రోడ్‌షోకు వేలాదిగా తరలివచ్చిన జనం

మోటారు మెకానిక్ ఆత్మహత్య


మృతిచెందిన రఫీ

దర్మవరం, మే 11: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో శనివారం రాత్రి మోటారు మెకానిక్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజేంద్రనగర్‌కు చెందిన అమీర్ కుమారుడు రఫీ(18) మోటారు మెకానిక్ చేస్తూ కుటుంబసభ్యులకు చేదోడుగా ఉండేవాడు. అయితే ఏదో విషయంలో తండ్రి అమీర్ మందలించడంతో రఫీ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లోనే ఓ గదిలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటి తరువాత కుటుంబసభ్యులు లోపలికి వచ్చేసరికి ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. తల్లిదండ్రులు బోరున విలపించారు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్యకుగల కారణాలను కుటుంబసభ్యులను అడిగితెలుసుకున్నారు. అనంతరం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో చికెన్ వ్యాపారి మృతి


మహమ్మద్ రఫీ(ఫైల్)

ముదిగుబ్బ,మే11: రోడ్డు ప్రమాదంలో చికెన్ వ్యాపారి మృతి చెందిన సంఘటన మండలంలోని జొన్నలకొత్తపల్లి సమీపంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెద్దచిగుళ్లరేవు గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ(40) జొన్నలకొత్తపల్లి గ్రామంలో చికెన్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే శనివారం ఆయన రాళ్లఅనంతపురంలోని ఒక దాబాకు చికెన్ సరఫరా చేయడానికి ద్విచక్ర వాహనంలో బయలు దేరాడు. మార్గంమధ్యలోని జొన్నలకొత్తపల్లి వద్దనున్న గ్యాస్ గోడౌన్ సమీపంలోకి రాగానే ఎదురుగా కారు వేగంగా వస్తూ అదుపు తప్పి ఢీకొంది. ప్రమాదంలో మహమ్మద్ రఫీ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద మరణంతో వారి రోదనలు మిన్నంటాయి.

108 వాహనం బోల్తా.. ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన 108 వాహనం

నల్లచెరువు, మే 11: మండలంలోని మాడిశెట్టి పల్లి సమీపంలో చెరువు వద్ద ఉన్న మలుపులో 108 వాహనం బోల్తాపడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇదే పంచాయతీలోని కొత్తకమ్మవారిపల్లినుంచి అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని శనివారం కదిరికి తీసుకెళ్తుండగా వాహనం మలుపులో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఈఎంటీ ఓబులరెడ్డి, డ్రైవర్ వెంకటేష్‌కు గాయాలైయ్యాయి. స్థానికులు మరో 108లో వారిని కదిరి ఆసుప్రతికి తరలించారు.

తలమర్లలో కవాతు

కొత్తచెరువు, మే11: మండలంలోని తలమర్ల గ్రామంలో శనివారం సాయంత్రం సీఐ రాజారమేశ్ ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా కవాతు సాగింది. అనంతరం సీఐ మాట్లాడుతూ మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో కవాతు చేస్తున్నామన్నారు. ఓటర్లు ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి కాకుండా ఉండడానికి, ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి గాను ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఎవరైనా ఎన్నికలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పేట వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పేట వేంకటేశ్వర స్వామి

హిందూపురం అర్బన్, మే 11: భక్తుల కోర్కెలు తీర్చే దైవం పేట వేంకటేశ్వరుడు అని నానుడి. పట్టణ పరిధిలో ని పేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూల విరాట్‌కు శనివారం వివిధ అభిషేకాలు చేసి శ్రీమన్నారాయణుడి గా అలంకరించారు. అర్చనలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

రేపు సింగిల్ ఫేస్ విద్యుత్

మడకశిర టౌన్, మే 11: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మడకశిర డివిజన్ పరిధిలో సోమవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సింగిల్ ఫేస్ విద్యు త్తును సరఫరా చేయనున్నట్లు విద్యుత్తు శాఖ డీఈ భూ పతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి ఆదివారం రాత్రి 9గంటల నుంచి సోమవారం ఉద యం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. సోమవారం ఒంటిగంట తరువాత సంబంధిత ఏఈని సంప్రదిస్తే స్థానిక పరిస్థితులను బట్టి వీలుంటే వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు. ఎన్నికల సందర్భంగా విద్యుత్ పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ


కమ్మలవాండ్లపల్లి చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీఐజీ ఇమ్‌నా లెన్నా

గోరంట్ల, మే 11: మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్ద కర్ణాటక సరిహద్దులోని చెక్ పోస్టును స్థానిక డీఐజీ, ఎన్నికల పరిశీలకుల ఇమ్‌నా లెన్నా శనివారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కర్ణాటక నుంచి మద్యం, నగదు, ఇతర బహుమతి వస్తువులు రవాణాకాకుండా చర్యలు చేపట్టాలని సి బ్బందిని ఆదేశించారు. అనంతరం సమస్యాత్మక గ్రామా లైన కమ్మలవాండ్లపల్లి, వెంకటరమణపల్లి, పోలింగ్ కేం ద్రాలను సందర్శించారు. ఎన్నికల పోలింగ్ విధులకోసం మండలానికి కేటాయించిన సీఆర్‌పీఎఫ్ దళాలతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత పోలింగ్‌కు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆయనతోపాటు సీఐ సుబ్బరాయుడు ఉన్నారు.

మద్యం దుకాణాలు బంద్


పట్టణంలో బార్ అండ్ రెస్టారెంట్ మూసివేసిన దృశ్యం

హిందూపురం అర్బన్, మే 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, కల్లు దుకాణాలు శనివారం సాయంత్రం ఎక్సైజ్ శాఖ అధికారులు మూసివేయించా రు. నియోజకవర్గ వ్యాప్తంగా 9 మద్యం షాపులు, 3 బార్ అండ్ రెస్టారెంట్‌లు మూసివేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వృధ్వీ తెలిపారు. మరలా 13వ తేదీ సాయంత్రం 7 గంటల తరువాత తెరుస్తారన్నారు. అంత వరకు దుకాణాలు తెరచినా అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇంట్లో చోరీ

150గ్రాముల బంగారు నగలు రూ.4.10లక్షలు నగదు చోరీ


ఇంట్లో బీరువాను పగుల గొట్టిన దృశ్యం

గోరంట్ల, మే 11: పట్టణంలోని తహసీల్దార్ కార్యా లయం సమీపం లోని కేశవాచారి ఇంట్లో శుక్రవారం రాత్రి దొంగలుపడి 150గ్రాముల బం గారు నగలు , రూ. 4.10లక్షలు నగదు చోరీ చేశారు. గోరం ట్లలోని పాత గ్రా మీణ బ్యాంక్ వద్ద కేశవాచారి బంగా రం దుకాణం నిర్వ హిస్తున్నారు. కేశవాచారి భార్య అనిత తెలిపిన వివరాల మేరకు.. జీనవాండ్లపల్లిలోని బంధువుల ఇంటిలో సీ మంతం కార్యక్రమానికి ఇంటికి తాళం వేసి శుక్రవారం వెళ్లారు. దొంగలు ప్రహరీ దూకి ప్రధాన ద్వారం డోర్‌లాక్ పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా, కబోర్డులను పగులగొట్టి అందులోని రెండు బంగారు నక్లెస్‌లు, రెండు జతల కమ్మలు, దుకాణానికి సబంధించి వందగ్రాముల బంగారు వస్తువులతో పాటు రూ.4.10లక్షల నగదు ఎత్తు కెళ్లినట్లు తెలిపారు. ఏఎస్ఐ మద్దిలేటి సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్ ద్వారా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సొంత చెల్లెలికి న్యాయం చేయలేని జగన్


ర్యాలీలో భారీగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు


విజయ సంకేతం చూపుతున్న బాలకృష్ణ, వసుంధరాదేవి

- రాష్ట్రానికి ఏం చేస్తాడు?
- వైసీపీకి చుట్టంగా మారనున్న ల్యాండ్ టైటిలింగ్ చట్టం
- ఓటర్లు మేలుకోకపోతే సర్వనాశనం
- ఎన్నికల ప్రచారంలో బాలకృష్ణ

హిందూపురం, మే 11 : సొంత చెల్లి, తల్లికి న్యా యం చేయలేని దుర్మార్గుడు జగన్ అని, అలాంటి వ్యక్తి రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తాడని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచార ము గింపు సందర్భంగా ఆయన శనివారం హిందూపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దీనికి నియోజకవర్గ వ్యా ప్తంగా వేల మంది తరలివచ్చారు. నంది సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. అక్కడ బాల కృష్ణ మాట్లాడుతూ... అన్న అన్యాయం చేశాడు... తాము మోసపోయామంటూ సొంత చెల్లెలు ఆరోపిస్తుంటే ఈ ముఖ్యమంత్రికి చెవికెక్కలేదన్నారు. తల్లి కూడా అతడి దెబ్బకు తట్టుకోలేక మన రాష్ట్రానికి రావడం మానేసిం దన్నారు ఇలాంటి సీఎం రాష్ట్ర ప్రజలకు ఏం మేలు చేస్తా డో గ్రహించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో పేదల భూములన్నీ వైసీపీ నాయకు ల వశం అవుతాయని, టీడీపీ అధికారంలోకి వస్తే దాన్ని రద్దుచేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు ఆలోచించి సోమవా రం ఓటు వేయాలన్నారు. ప్రపంచంలో ఏ పార్టీకి లేని విధంగా టీడీపీకి కార్యకర్తలు ఉన్నారని, వారున్నంత కా లం పార్టీ ఓ మహాశక్తిగా ఉంటుందన్నారు. నవరత్నాల పేరుతో జగన్ అక్క, చెల్లెమ్మలను మోసం చేశారని, జే బ్రాండ్ మద్యంతో లక్షల మంది ప్రాణాలు పోయార న్నారు. చిలమత్తూరు మండలం వీరాపురాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే బాధ్యత తనదేనన్నారు. పురంలో మళ్లీ అన్న క్యాంటీన్ ఏర్పాటుచేస్తామని, ప్రభుత్వాసు పత్రి రూపురేఖలు మార్చుతామని హామీ ఇచ్చారు. ఈ ర్యాలీలో నందమూరి వసుంధరాదేవి, టీడీపీ, బీజేపీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురం పసుపు మయం

బాలకృష్ణ ర్యాలీ సందర్భంగా హిందూపురంలోని రహదారులన్నీ పసుపుమయంగా మారాయి. ఎక్కడ చూసినా జైబాలయ్య, చంద్రబాబు నినాదాలతో హోరెత్తించారు. తెలుగుదేశం పార్టీ పాటలతో నాయకులు, కార్యకర్తలు నృత్యం చేశారు. చి న్నారుల నుంచి వృద్ధుల వరకు రోడ్ల వెంబడి పసుపు జెండా పట్టుకుని ముందుకు సాగారు. వేలాదిగా తరలివచ్చిన శ్రేణులతో హిందూ పురంలో శనివారం ఎన్నికల ప్రచారం ముగింపు ర్యాలీ ఘనంగా జరిగింది. ఇక్కడి నుంచి పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు మూడు సార్లు ఎమ్మె ల్యేగా ప్రాతినిధ్యం వహించారు. నందమూ రి హరికృష్ణ ఒకసారి గెలిచిరు. ఇలాంటి నియోజకవర్గం లో ఎమ్మె ల్యే నందమూరి బాలకృష్ణ ఇప్పుడు మూడో సారి బరిలో నిలిచారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ పచ్చజెండా రెపరెపలాడుతోంది. ఇప్పటికే పది సార్లు టీడీపీ అభ్య ర్థులను గెలిపించిన నియోజకవర్గ ప్రజలు 11వ సారి ఎమ్మెల్యే బాలకృష్ణను గెలిపించేందుకు ఓట ర్లు సన్నద్ధం అయినట్లు రాజకీయ విశ్లేషకులు భావి స్తున్నారు. ఆఖరి రోజు కావడంతో పట్టణంలో నిర్వహిం చిన ర్యాలీ పసు పుమయంగా మారింది. పార్టీ నాయకులు, అభిమానులు ద్విచక్రవాహనాలతో ర్యాలీ చేసి హోరెత్తించారు.

వైసీపీ వారికి ఓటమి భయం పట్టుకుంది

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత


ఆర్ మరువపల్లిలో సమీక్షలో సవిత, పరిశీలకుడు నరసింహారావు

రొద్దం, మే 11 : పెనుకొండ నియోజకవర్గంలో వైసీపీ వారికి ఓటమి భయం పుట్టుకుందని పెనుకొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. రొద్దం మండల పరిధిలోని ఆర్ మరువపల్లిలో శనివారం టీడీ పీ నాయకుడు నరసింహులు స్వగృహంలో ఆమె టీడీపీ స్థానిక నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... ప్రతి కా ర్యకర్త సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ వి జయానికి సైనికుడిలా పనిచేయాల ని కోరారు. గ్రామాల్లో అత్యధికంగా పోలింగ్ జరిగేలా పనిచేయా లని... తనకు, బీకేకు ఓట్లు పడేలా కృషిచేయాలన్నారు. ఎవరికీ భయపడ వద్దని అండగా తాముంటామని భరోసా ఇ చ్చారు. రొద్దం మండల కేంద్రంతో పాటు మండల వ్యా ప్తంగా భారీ మెజార్టీ వస్తుందని వైసీపీ వారికి సవాల్ విసిరారు. వైసీపీ వారివద్ద ధనబలం ఉంటే తన దగ్గర ప్రజాబలముందన్నారు. ఎవరైనా కార్యకర్తలు టీడీపీకి మోసం చేస్తే తల్లికి మోసం చేసినట్లేనన్నారు. ముఖ్య అతిథిగా పెనుకొండ నియోజకవర్గ పరిశీలకుడు నరసింహరావు హాజరయ్యారు. టీడీపీ, బీజేపీ నాయకులు మాధవనాయుడు, నరసింహులు, చిన్నప్పయ్య, వేణు, పవన్, అశ్వత్థనారాయణ, మురళి, చంద్రశేఖర్‌నాయుడు, వీరాంజనేయు లు, ఉగ్గిరప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే వడ్డెర్లకు న్యాయం

పెనుకొండ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడ్డెర్లను ఎస్టీల్లోకి చేర్చుతామని చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ మాట ఇచ్చారని వ డ్డెర్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్ అన్నారు. ఆయన శనివారం టీడీపీ స్థానిక కార్యాలయంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవితతో కలిసి వడ్డెర్ల సమా వేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తం గా వడ్డెర కులస్థులు టీడీపీకి అండగా ఉన్నారన్నారు. బీసీ డిక్లరేషన్ వేదికగా వడ్డెర్లను ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నారా యణ, నాగప్ప, ఆది, వెంకటేష్, శ్రీనివాసులు, మోహన్, రాజేష్, మురళి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు

పెనుకొండ టౌన్: అధికార పార్టీ వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఆగడం లేదు. రొద్దం, సోమందేపల్లి, పరిగి మండలాలకు చెందిన 50 కుటుం బాలు శనివా రం టీడీపీలో చేరాయి. వారికి సవిత టీడీపీ కండువా వేసి స్వాగతించారు. రొద్దం మండలం తురకలాపట్నం కేపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 20 కుటుంబాలు, రొద్దం మండలం గోనిమేకలపల్లి, పరిగి మండలం శ్రీరంగరాజు లపల్లి సర్పంచ్ మల్లక్క, అశోక్, శివతోపాటు 30కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. అధికారపార్టీ వైసీపీలో అభివృద్ధి జాడేలేదని, రానున్నది టీడీపీయేనని, అందుకే పార్టీ మారినట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న వడ్డె వెంకట్


టీడీపీలోకి చేరిన వారితో సవిత

వైసీపీ పాలన అన్ని రంగాల్లోనూ విఫలం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు


అగళిలో ఎంఎస్ రాజుకు గజమాలతో సత్కారం


గుండుమలలో పూలమాలలతో స్వాగతం

అగళి, మే 11 : వైసీపీ పాలన అన్ని రంగాల్లో విఫల మైందని.... రాష్ట్రంలో సైకో ప్రభుత్వం పోయి, చంద్ర బాబు రావాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుం డుమల తిప్పేస్వామి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు పేర్కొన్నారు. వారు శనివారం అగళి మండల కేంద్రంలో అనంతరం రామాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.... మడకశిర ప్రాంతానికి పరిశ్రమలు, సాగునీరు, తాగునీరు రావాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటేయాలని కోరారు. వైసీపీ పాలని అన్ని రంగాల్లోనూ విఫలమైం దని ఎక్కడ చూసినా అరాచకాలు, దౌర్జన్యాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎస్ రాజు, పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలని కోరా రు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీన ర్ కుమారస్వామి, మండల క్లస్టర్ ఇన్చార్జ్ శివకుమార్, మాజీ సర్పంచ్ రవికుమార్, మండల మాజీ కన్వీనర్ షౌకత్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నరసింహప్ప, కమ్మర శివన్న బోయ నాగరాజు తదితర నాయకులు, కార్యకర్తలు అభిమా నులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మడకశిర రూరల్: టీడీపీ హయాంలోనే గ్రామ స్థాయి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ఆయన శనివారం గుండుమల తిప్పేస్వామితో కలిసి మం డలంలోని గుండుమల పంచాయతీలో ఎన్నిల ప్రచా రం నిర్వహించారు. గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు. గుండుమల గ్రామం పసుపుమయమైంది. మహిళలు టీడీపీ జెండా ఎత్తుకొని నృత్యాలతో హోరెత్తించారు. నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని గౌడనహళ్లి పంచా యతీకి చెందిన వైసీపీ నాయకలు టీడీపీలో చేరారు. వారికి గుండు మల తిప్పేస్వామి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

మడకశిర టౌన్: ఎన్నికలు రెండు రోజులుండగా టీడీపీలో చేరికలతో పార్టీలో కొత్త జోష్ కనిపిస్తోంది. గుడిబండ మండలం సీపీగిరికి చెందిన డ్రైవర్ నరసిం హమూర్తితో పాటు అనుచరుల 30కుటుంబాలు వైసీపీ ని వీడి టీడీపీలో చేరాయి. అలాగే మడకశిర మండలం జిల్లెడగుంట గ్రామానికి చెందిన మైలారప్ప, మూర్తి, గుజ్జీరప్పతో పాటు 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, నియోజ కవర్గం సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామి ప ట్టణంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కార్యనిర్వహక కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.


గుండుమలలో నృత్యాలతో హోరెత్తించిన మహిళలు

మైనార్టీల ద్రోహి జగన్

మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్


మైనార్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఇక్బాల్

హిందూపురం, మే 11 : మైనార్టీల సంక్షేమ పథకాలను రద్దుచేసి, సీఎం జగన్మోహన్‌రెడ్డి మైనార్టీల ద్రోహిగా మిగిలిపోయారని మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం పూలకుంట లో మైనార్టీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇక్బాల్ మాట్లాడుతూ తె లుగుదేశం పార్టీ హయాంలో మైనార్టీల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ వైసీపీ పాలనలో రద్దుచేశారన్నారు. రంజాన్‌తోఫా, దుల్హన్ పథకంతోపాటు మరికొ న్ని పథకాలు కనుచూపుమేరలో లేకుండా చేసిన ఘనత జగన్‌ది అన్నారు. సీఏఏ చట్టం మైనార్టీలకు ద్రోహం చేస్తుందని వైసీపీ నాయకులు ఇప్పుడు చెబుతున్నారని, కానీ ఆ చట్టానికి ఓటేసింది ఏ పార్టీ ఎంపీలో చెప్పాలన్నారు. ఢిల్లీలో బీజేపీతో దోస్తీ చేస్తూ ఇక్కడ మాత్రం వారికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డికి బీజేపీపై పల్లెత్తి మాటకూడా మాట్లాడే దమ్ము లేదని, ఏదైనా మాట్లాడితే బె యిల్ రద్దవుతుందని జంకుతున్నార్నారు. రాష్ట్ర భవిష్యత్తును ఆయన తన బెయిల్ కు తాకట్టు పెట్టారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మైనార్టీల కోసం మరిన్ని సం క్షేమ పథకాలు వస్తాయన్నారు. ముఖ్యంగా 50ఏళ్లకే పింఛన్ మైనార్టీలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు.ఇతర పథకాలు కూడా అండగా నిలుస్తాయన్నారు. నంద మూరి బాలకృష్ణను అధిక మెజార్టీతో గెలిపిస్తే హిందూపురం అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో పూలకుంట సర్పంచ్ మంజునాథ్, నాయకులు రామకృష్ణారెడ్డి, వెంకటేశ్‌రెడ్డి, బాచి, కార్తీక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూముల తాకట్టుకు జగన్ సిద్ధం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



ల్యాండ్ టైట్లింగ్ చట్టం ప్రతులను తగలబెడుతున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, మే 11 : రాష్ట్రంలోని రైతుల భూములు తా కట్టు పెట్టేందుకు ల్యాం డ్ టైట్లింగ్ చట్టం 2024 పేరుతో సైకో సీ ఎం జగన్మోహన్‌రెడ్డి సి ద్ధంగా ఉన్నారని టీడీపీ కూటమి అభ్యర్థి సవిత విమర్శించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు. టీడీపీ స్థానిక కార్యాలయం వద్ద శనివారం నియోజకవర్గ పరిశీలకుడు నరసింహరావు, సవిత, టీడీపీ శ్రేణులు కలిసి ల్యాండ్ టైట్లింగ్ చట్టం ప్రతులను తగలబెట్టారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... ల్యాండ్ టైట్లింగ్ చట్టం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంద న్నారు. అన్నివర్గాల ప్రజలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారని అన్నారు. తాతా ముత్తాతల నుంచి వచ్చిన ఆస్తిని ఓ ప్రణాళిక ప్రకారం కాజేసేందుకు ఈ చట్టం తెచ్చారని ఆరోపించారు. పాసుపుస్తకాలపైన, సర్వేరాళ్లపైన, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపైన జగన్ బొమ్మ ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. ఏది ఏమైనా మీ భూములను జగన్ తాకట్టు పెట్టకుండా మీరే కాపాడుకోవా లని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి, రఘువీరచౌదరి, రామలింగ, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి ప్రచారం

రొళ్ల/ పావగడ, మే 11: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ శనివారం కాంగ్రెస్ పార్టీ రొళ్ల మండల కేంద్రంలో నిర్వహించిన సభలో పాల్గొని మాట్లాడారు. సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే సుధాకర్, ఎంపీ అభ్యర్థి షాహిన్ తరఫున ప్రసంగించా రు. ఈ కార్యక్రమంలో కర్ణాటక మంత్రి కేఎన్ రాజన్న, పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం


పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ మనోహర్

మడకశిర టౌన్, మే 11: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం 6గంటలకు తెరపడింది. ఎన్నికల అధికారు లు ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం 7గంటల నుంచి జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారు. మడకశిర నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 241పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవ ర్గంలో 2,11,074 మంది తమ ఓటు హక్కును వినియోగించుకో నున్నారు. అందులో పురుషులు 1.62లక్షల మంది, మహిళా ఓట ర్లు 1.48లక్షల మంది ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికారుల ఆదేశాలతో ఇప్పటికే నియోజక వర్గంలోని అన్ని దుకా ణాలు మూసివేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు 450 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు సీఐ మనోహర్ తెలిపారు. వారికి శనివవారం మడకశిర సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల నియమా వళిపై సీఐ సూచనలు ఇచ్చారు. అనంతరం మడకశిర పట్టణంలో కవాతు నిర్వహించారు. మడకశిర నియోజకవర్గ ప్రాంత వాసులు తప్ప ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎవరూ నియోజకవర్గంలో ఉండరాదని సీఐ తెలిపారు.

ప్రశాంతంగా ఓటు వేయండి : సీఐ

చిలమత్తూరు, మే 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం పోలింగ్ రోజున ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాం తంగా వినియోగిం,చుకోవాలని హిందూపురం రూరల్ సీఐ ఈరన్న, చిలమత్తూరు ఎస్ఐ గంగాధర్ ప్రజలకు సూచించారు. త్వరలో జరుగుతున్న పోలింగ్‌ని దృష్టిలో పెట్టుకొని శనివారం వారు పోలీసు సిబ్బంది, 471 బెటాలియన్‌కి చెందిన బీఎస్ఎఫ్ అధికారులతో కలిసి మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించారు. **గోరంట్ల :** పట్టణంలోని ప్రధాన రహదారితోపాటు పలు వీధుల్లో పెద్దఎత్తున పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. సీఐ సుబ్బరాయుడు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కమాడెంట్ రాజేష్‌కు మార్, ఇన్‌స్పెక్టర్లు బీకే ఘోష్, డీబీ మెహతా, ఎస్ఐలు రామారావు, విశ్వమిత్రతివారీ, పళనీస్వామి, సంతోష్‌కుమార్, వారి సిబ్బంది, ఏఎస్ఐ ధనుంజయరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు ప్రదర్శన జరిపారు.

హంగులు, రంగులతో పోలింగ్ కేంద్రాలు



పింక్ పోలింగ్ కేంద్రం ముఖద్వారం

గోరంట్ల, మే 11: సార్వత్రిక ఎన్నికల కోసం ప్రజలను ఆకర్షించే విధంగా వినూత్న రీతిలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెనుకొండ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల కోసం పింక్ పోలింగ్ కేంద్రం, సోమందేపల్లిలో యువత కోసం యూత్ పోలింగ్ కేంద్రం, పెనుకొండలో అన్ని హంగులతో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పా టు చేస్తున్నట్లు పెనుకొండ మున్సిపల్ కమిషనర్, ఎన్నికల నోడల్ ఆఫీసర్ వంశీకృష్ణభార్గవ్ తెలిపారు. గోరంట్ల బాలికల ఉన్నత పాఠశాలలోని 245 పోలింగ్ కేంద్రాన్ని పింక్ రంగుతో అలంకరించా రు. ముఖద్వారం వద్ద ఓటర్లకు స్వాగతం పలుకుతూ సఖి పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారం నుంచి పోలింగ్ కేంద్రం వరకు పింక్‌రంగు తివాచీ, ఇరువైపులా పూలకుండీలు ఏర్పాటు చే శారు. పింక్ పోలింగ్ కేంద్రాన్ని నోడల్ ఆఫీసర్ వంశీకృష్ణభార్గవ్, తహసీల్దార్, ఏఆర్ఓ అక్బల్‌బాషా, ఎంపీడీఓ, ఎంసీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. అధికారులు పోలింగ్ బీ ఎల్ఓలను, ఎన్నికల నిర్వాహక అధికారుల స్థానంలో కూర్చోపెట్టి మాక్ ట్రైల్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రం ద్వారా 588 మంది మహిళలు, 593 మంది పురుషులు ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. ఎన్నికలకు పండుగ వాతావరణ కల్పించడంతో అధికా రులు సంతృప్తి వ్యక్తం చేశారు. స్పెషలాఫీసర్ బాలాజీ ప్రసాద్, వీ ఆర్ఓ అనిల్‌కుమార్, మన్సూర్, చంద్రకళ, బీఎల్ఓలు పాల్గొన్నారు.


పోలింగ్ మాక్ ట్రయల్ నిర్వహిస్తున్న అధికారులు

దివ్యాంగ ఓటర్ల కోసం ట్రైసైకిళ్లు

హిందూపురం, మే 11 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవా రం జరుగనుంది. ఈ సందర్భంగా ఓటు వేసేందుకు పోలింగ్ కేం ద్రాల వద్దకు వచ్చే దివ్యాంగులు లోపలికి వెళ్లేందుకు వీలుగా ము నిసిపాలిటీ ట్రైసైకిళ్లను కొనుగోలుచేసింది. హిందూపురానికి శని వారం 64ట్రైసైకిళ్లు తెప్పించారు. వాటిని ఆదివారం సాయంత్రానికి ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుతామని మునిసిపల్ అధికారులు తెలిపారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

అగళి, మే 11 : టీడీపీని గెలిపించి చం ద్రబాబును రాష్ట్ర ము ఖ్యమంత్రిని చేసు కుందామని టీడీపీ మండల కన్వీనర్ కు మారస్వామి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకు మార్ పేర్కొన్నారు. మండలంలోని డొక్కల పల్లిలో శనివారం టీడీ పీ నాయకులు ఇంటిం టి ప్రచారం చేపట్టారు. సూపర్‌సిక్స్, మేని ఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్‌రాజు, ఎంపీ అభ్యర్థి పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఐటీడీపీ మ హేష్, గుండా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.